# Bhaj-Govindam

( Telugu )

# మోహ ముద్గర

1. భజ గోవిందం, భజ గోవిందం, గోవిందం భజ మూఢమతే ।
సంప్రాప్తే సన్నిహితే కాలే, నహినహి రక్షతి డుకృఞ్కరణే ॥
॥భజ॥

2. మూఢ! జహీహి, ధనాగమతృష్ణాం, కురుసద్ బుద్ధిం మనసి వితృష్ణాం।
యల్లభసే నిజకర్మోపాత్తం, విత్తం తేన వినోదయ చిత్తం ॥
॥భజ॥

3. నారీస్తనభరనాభీదేశం, దృష్ట్వా మాగా మోహావేశం ।
ఏతన్మాంసవసాదివికారం, మనసి విచింతయ వారం వారం ॥
॥భజ॥

4. నళినీదళగతజలమతితరళం, తద్వత్ జీవిత మతిశయచపలం ।
విద్ధి, వ్యాధ్యభిమానగ్రస్తం, లోకం శోకహతం చ సమస్తం ॥
॥భజ॥

5. యావత్ విత్తోపార్జనశక్తః తావన్నిజపరివారోరక్తః ।
పశ్చాత్ జీవతి, జర్జరదేహే, వార్తాం కోఽపి న పృచ్ఛతి గేహే ॥
॥భజ॥

6. యావత్ పవనో నివసతి దేహే, తావత్ పృచ్ఛతి కుశలం గేహే ।
గతవతి వాయౌ దేహాపాయే, భార్యా బిభ్యతి తస్మిన్ కాయే ॥
॥భజ॥

7. బాలస్తావత్ క్రీడాసక్తః తరుణస్తావత్ తరుణీసక్తః ।
వృద్ధస్తావత్ చింతాసక్తః, పరమే బ్రహ్మణి కోఽపి న సక్తః ॥
॥భజ॥

8. కాతే కాంతా కస్తే పుత్రః, సంసారోఽయమతీవ విచిత్రః, ।
కస్య త్వం వా కుత ఆయాతః, తత్త్వం చింతయ తదిహభ్రాతః ॥
॥భజ॥

9. సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం ।
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం, నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః ॥
॥భజ॥

10. వయసి గతే కః కామవికారః, శుష్కే నీరే కః కాసారః ।
క్షీణే విత్తే కః పరివారో, జ్ఞాతే తత్త్వే కః సంసారః ॥
॥భజ॥

11. మా కురు ధనజనయౌవనగర్వం, హరతి నిమేషాత్ కాలః సర్వం ।
మాయామయమిదమఖిలం బుద్ధ్వా, బ్రహ్మపదం త్వం ప్రవిశ విదిత్వా ॥
॥భజ॥

12. దినయామిన్యౌ సాయం ప్రాతః, శిశిరవసంతౌ పునరాయాతః ।
కాలఃక్రీడతి గచ్ఛత్యాయుః, తదపి న ముంచత్యాశావాయుః ॥
॥భజ॥

13. కాతే కాంతా ధనగతచింతా, వాతుల కిం తవ నాస్తి నియంతా ।
త్రిజగతి సజ్జనసంగతిరేకా, భవతి భవార్ణవతరణే నౌకా ॥
॥భజ॥

14. జటిలో ముండీ లుంచితకేశః, కాషాయాంబర బహుకృతవేషః ।
పశ్యన్నపి చ న పశ్యతి మూఢో హ్యుదరనిమిత్తం బహుకృతవేషః ॥
॥భజ॥

15. అంగం గళితం, పలితం ముండం, దశనవిహీనం జాతం తుండం ।
వృద్ధో యాతి గృహీత్వా దండం, తదపి న ముంచత్యాశాపిండం ॥
॥భజ॥

16. అగ్రే వహ్నిః పృష్ఠే భానుః రాత్రౌ చుబుకసమర్పితజానుః ।
కరతలభిక్షస్తరుతలవాసః, తదపి న ముంచత్యాశాపాశః ॥
॥భజ॥

17. కురుతే గంగా సాగరగమనం, వ్రత పరిపాలనమథ వా దానం ।
జ్ఞానవిహీనః సర్వమతేన, ముక్తిం న భజతి జన్మశతేన ॥
॥భజ॥

18. సురమందిర తరుమూల నివాసః, శయ్యాభూతలమజినం వాసః ।
సర్వపరిగ్రహ భోగత్యాగః కస్య సుఖం న కరోతి విరాగః ॥
॥భజ॥

19. యోగరతో వా భోగరతో వా, సంగరతో వా సంగవిహీనః ।
యస్య బ్రహ్మణి రమతే చిత్తం, నందతి నందతి నందత్యేవ ॥
॥భజ॥

20. భగవద్గీతా కించిదధీతా, గంగాజలలవకణికా పీతా ।
సకృదపి యేన మురారి సమర్చా, క్రియతే తస్య యమేన న చర్చా ॥
॥భజ॥

21. పునరపి జననం పునరపి మరణం, పునరపి జననీ జఠరేశయనం ।
ఇహ సంసారే బహుదుస్తారే, కృపయాఽపారే పాహి మురారే ॥
॥భజ॥

22. రథ్యాచర్పట విరచిత కంథః, పుణ్యాపుణ్య వివర్జితపంథః ।
యోగీ యోగ నియోజిత చిత్తో, రమతే బాలోన్మత్తవదేవ ॥
॥భజ॥

23. కస్త్వం, కోఽహం, కుత ఆయాతః, కామే జననీ, కో మే తాతః ।
ఇతి పరిభావయ సర్వమసారం, విశ్వం త్యక్త్వా స్వప్నవిచారం ॥
॥భజ॥

24. త్వయి మయి చాన్య త్రైకో విష్ణుః, వ్యర్థం కుప్యసి మయ్యసహిష్ణుః ।
భవ సమచిత్తః సర్వత్ర త్వం, వాంఛస్యచిరాద్యది విష్ణుత్వం ॥
॥భజ॥

25. శత్రౌ మిత్రే పుత్రే బంధౌ, మాకురు యత్నం విగ్రహ సంధౌ ।
సర్వస్మిన్నపి పశ్యాత్మానాం, సర్వత్రోఽథ సృజ, భేదా జ్ఞానం ॥
॥భజ॥

26. కామం క్రోధం లోభం మోహం త్యక్త్వాఽఽత్మానం పశ్యతి సోఽహం।
ఆత్మజ్ఞానవిహీనా మూఢాః, తే పచ్యంతే నరక నిగూఢాః ॥
॥భజ॥

27. గేయం గీతానామసహస్రం, ధ్యేయం శ్రీపతి రూపమజస్రం ।
నేయం సజ్జనసంగే చిత్తం, దేయం దీనజనాయ చ విత్తం ॥
॥భజ॥

28. సుఖతః క్రియతే రామాభోగః, పశ్చాత్ హంత శరీరే రోగః ।
యద్యపి లోకే మరణం శరణం, తదపి న ముంచతి పాపాచరణం ॥
॥భజ॥

29. అర్థ మనర్థం భావయ నిత్యం, నాస్తితతః సుఖలేశః సత్యం ।
పుత్రాదపి ధనభాజాం భీతిః, సర్వత్రైషా విహితా రీతిః ॥
॥భజ॥

30. ప్రాణాయామం ప్రత్యాహారం, నిత్యానిత్య వివేక విచారం ।
జాప్యసమేత సమాధివిధానం, కుర్వవధానం మహదవధానం ॥
॥భజ॥

31. గురుచరణాంబుజ నిర్భరభక్తః, సంసారాదచిరాద్భవ ముక్తః ।
సేంద్రియమానస నియమాదేవం, ద్రక్ష్యసి నిజహృదయస్థం దేవం ॥
॥భజ॥

❖ ❖ ❖

# 1

భజగోవిందం, భజగోవిందం, గోవిందంభజ మూఢమతే ।
సంప్రాప్తే సన్నిహితే కాలే, నహినహి రక్షతి డుకృఞ్కరణే ॥

**గోవిందుని భజించు, సేవించు గోవిందుని, గోవిందునే భజింపవోయీ మూఢమతీ! నీ అంత్యకాలం ఆసన్నమైనప్పుడు నీవు వల్లెవేస్తున్న ఈ వ్యాకరణసూత్రం నిన్ను ఏవిధంగానూ రక్షించలేదు సుమా!**

సామూహికంగా ఈ భజగోవింద గానం చేసేటప్పుడు ఈ మొదటి శ్లోకాన్ని పల్లవిగా, ప్రతీ శ్లోకం తరువాత పాడుతారు. తన జీవితమంతా వ్యాకరణ సూత్రాలనే వల్లె వేసుకుంటూ వ్యర్థం చేసుకుంటున్న ఒక వృద్ధుని నిమిత్తంగా పెట్టుకొని జగద్గురువైన ఆదిశంకరులు మానవాళికి ఒక అమోఘమైన సందేశాన్ని అందజేశారు.

ఏదైనా ఒక భాష నేర్చుకోవడానికి వ్యాకరణసూత్రాలు మొదటి మెట్టు మాత్రమే గాని అంతిమ గమ్యం మాత్రం కాదు. ఒక వ్యక్తి తన జీవితమంతా ఈ మొదటి మెట్టులోనే వ్యర్థ పుచ్చుకుంటుంటే, అతనిని పరమ మూఢుడే అనాలి. ఇక్కడ చెప్పబడిన "డుకృఞ్ కరణే" అనే పదం కేవలం ఒక వ్యాకరణసూత్రాన్నే సూచించినట్లు భావించరాదు. ఆధ్యాత్మపథంలో పురోగిమంచడానికి పనికిరాని సకల ప్రాపంచిక విద్యలను సూచిస్తున్నట్లుగా గ్రహించాలి. లౌకిక విద్యల ప్రయోజనం, మనుజుడు ఈ ప్రపంచంలో మనుగడను సాగించుకోడానికి మాత్రమే. అతని జీవన పరిమితి అతిచిన్నది. అనంతయాత్రలో అతని ప్రయాణం సుదీర్ఘమైనది. చేరవలసిన గమ్యము చాలా దూరంగా వుంది. మృత్యువు ఏ క్షణాన తనను తీసుకొనిపోతుందో తెలియనట్టిది. జీవితమంతా లౌకిక వ్యాపారాలకు పనికివచ్చే విద్యల నభ్యసించడంలోనే ఖర్చు పెట్టేసుకుంటే, మానవుడు మాధవుని చేరే ప్రయత్నం చేసేదెప్పుడు? భుక్తి గురించి అభ్యసించిన విద్యలేవీ ముక్తిని సాధించలేవు. ఈ సత్యాన్ని గ్రహించి, గమ్యాన్ని తెలుసుకొని, పురోగమించడానికి సాధన చేయాలి. పుస్తకజ్ఞానం పొందిన కొందరు ఇలా అనవచ్చు. గీతలో చెప్పబడింది

కదా. **"అంతకాలేచ మామేవ స్మరన్ ముక్త్వా కళేబరం, యఃప్రయాతి త్యజన్ దేహం, స యాతి, పరమాం గతిం"** అని. ఇంత సులువైన మార్గం ఉండగా మోక్షం గురించి ఇప్పటినుండే అంత చింత దేనికి? అని అనవచ్చు. గాని ఇక్కడ ఒక నిగూఢమైన విషయాన్ని గమనించాలి. అంతకాలే "చ" అని ఉంది. అంటే, అంత్యకాలంలో "కూడా" అని అర్థం. జీవితమంతా నన్నే స్మరిస్తూ శరీరాన్ని విడుచుక్షణంలో కూడా నన్ను స్మరించువాడు పరమపదాన్ని పొందుతాడు అని భగవానుడు చెప్పెను. ఈ స్మరణ, జీవితమంతా సాధన చేస్తుంటేనే తప్ప ఆఖరుక్షణంలో సంభవించదు. అందుచేతనే భజగోవిందం భజగోవిందం అని జగద్గురువు నొక్కిచెప్పారు.

భజ అంటే కేవలం తాళాలు తప్పెటలతో భజన చేయడమే కాదు. భజ అంటే సేవించడం, అర్చించడం, అర్పించడం, భజించడం, అని అర్థం. యాంత్రికంగా మంత్రాలు చదివేస్తూ ఘనంగా పుష్పాలు, అలంకరణలు, ప్రసాదాలతో నింపివేస్తూ, మనస్సును మాత్రం విషయాలవెంట, కోరికల వెంట, ప్రపంచమంతా సంచరించనిస్తూ, కేవలం శారీరకంగా చేసే అర్చనలు, భజన కాదు. దేహేంద్రియ మనోబుద్ధుల్ని పరమాత్మతో అనుసంధానంచేసి యుంచడమే నిజమైన సేవ, అర్చన, భజన. ఆత్మార్పణమే ఆత్మానుసంధాన మార్గము. ఆత్మార్పణం అంటే భగవంతుని పాదాలచెంత భక్తుడు కరిగిపోయి అదృశ్యమవడమే. ఇక మిగిలేది సుగంధ సౌరభమైన భక్తి పరిమళం మాత్రమే.

గోవింద అను శబ్దము శ్రీహరిని సూచిస్తుంది. అదియే పరబ్రహ్మము, పరమాత్మ అని తెలుసుకోవాలి. అట్టి గోవిందునే భజించుచుండాలి గాని, లౌకికవ్యాపారాల్లో చిక్కుకొని జీవితాన్ని వ్యర్థపరచుకోరాదు, అని ఈ శ్లోకములోని సందేశము.

## 2

**మూఢ! జహీహి, ధనాగమతృష్ణాం, కురు సద్బుద్ధిం మనసి వితృష్ణాం ।**
**యల్లభసే నిజకర్మోపాత్తం, విత్తం తేన వినోదయ చిత్తం ॥**

**ఓ మూఢుడా! ధనార్జన చేయాలనే తృష్ణను నీ మనసునుండి పారద్రోలు. తృష్ణ లేకుండా చేయబడిన నీ మనసు లోనికి, సద్బుద్ధితో కూడియున్న ఆలోచనల్నే ప్రవేశింపజేయి. నీ స్వధర్మానుగుణమైన కర్మలు చేస్తూ, వాటివలన లభించు విత్తము (ఫలము)ను అనుభవిస్తూ ఆనందించు.**

మానవుడు ఆ పరమాత్మ అంశతో జన్మించిన జీవుడు. కాని ప్రకృతియొక్క త్రిగుణాల ప్రభావంవలన, దేహేంద్రియ మనోబుద్ధులలో తాదాత్మ్యాన్ని చెందినవాడై, ఒక సంసారియై, శీతోష్ణ సుఖదుఃఖాది ద్వంద్వ అనుభవాలకు లోనయి, జననమరణ సుడిగుండంలో కొట్టుకుంటున్నాడు. అస్థిరమైన అశాశ్వతమైన అనుభవాల గురించి వెతుక్కుంటూ, లేనివాటిని ఎలాగైనా పొందాలని, ఉన్నవాటిని దాచుకొని, వృద్ధి చేసుకోవాలని, యాతనలు పడ్తుంటాడు. ధనమూలమిదమ్ జగత్ అని నమ్మినవాడై, ఆ ధనాన్ని ఏవిధంగానైనా ఆర్జించాలి అనే కాంక్షలు పెంచుకొని, దాన్నిగురించి అహర్నిశలూ పాటుపడ్తుంటాడు. కోరికలు తీరుతున్న కొద్దీ ఇంకా ఇంకా అనుభవించాలి, పొందాలి అనే తృష్ణ ఏర్పడుతుంది. ఇది కోరికలయొక్క సహజ లక్షణం. కోరిక తీరకపోతే కోపం వస్తుంది. ఏవిధంగానైనా తీర్చుకోవాలనే మూర్ఖపు పట్టుదల పెరుగుతుంది. ఈ లక్షణాలు గల వ్యక్తినే జగద్గురువు మూఢ అని సంబోధించారు. ఇక్కడ ధన మనగా కేవలం డబ్బు మాత్రమే కాదు. మానవుడు అనుభవించగోరు సమస్త విషయసముదాయం అని అర్థం. ధన, వస్తు, విషయ, సంపదలందు ఎట్టి దోషమూలేదు. ఉపాధి సంరక్షణకు, పోషణకు, అవి ఎంత అవసరమో, అంతవరకూ అనుభవించినా తప్పులేదు. కాని, వాటిని సంపాదించి, పోగు చేసుకోవాలనే తీవ్రకాంక్ష, తృష్ణ మాత్రము ఉండరాదు. ఈ తృష్ణ అన్ని అనర్థాలనూ తెచ్చిపెడ్తుంది కనుక దీనిని సంపూర్ణముగ తొలగించుకోవాలి. మనసునుండి తృష్ణను తొలగించి, దాని స్థానంలో సద్బుద్ధిని నెలకొల్పాలి. సద్బుద్ధి అంటే మామూలు అర్థం నిర్మలమైన మంచి ఆలోచనలు, ఇక్కడ మంచి ఆలోచనలతోపాటు, సత్ వస్తువైన పరమాత్మయందు బుద్ధిని లగ్నం చేయడం అని కూడ గ్రహించాలి. మనసు ఎల్లప్పుడూ ఏదో ఒక ప్రవృత్తిలో ప్రవర్తిస్తుండాలి. గనుక దానిని

శూన్యంగా వుంచితే మళ్లీ కోరికలు ముసురుకుంటాయి. అందుచేత కోరికలు తొలగింపబడిన మనసును ఆత్మధ్యానమందు నిమగ్నం చేయాలి.

అయితే, ధనార్జన లేకుండా జీవనం గడిచేదెట్లా అనే ప్రశ్నకు సమాధానంగా - యల్లభసే నిజకర్మోపాత్తం, విత్తం తేన వినోదయ చిత్తం - అన్నారు. అనగా నీ స్వంతకృషివలన ఉత్పన్నమయిన ఫలం, ఏది లభిస్తే దానిని అనుభవించు, సంతృప్తి చెందు, ఆనందించు, అన్నారు. సంతృప్తిని మించిన సౌభాగ్యం ఇంకేదీ లేదు. సంతృప్తి లేనివానికి మేరు పర్వతం లభించినా, చాలదని చింతిస్తుంటాడు. నిత్యతృప్తుడు ఎట్టి పరిస్థితిలోనైనా దైన్యత చూపడు. అతనికి లేదు, చాలదు, అనే భావమే రాదు. తృష్ణను పారద్రోలి తృప్తిని పెంచుకొన్న మానవుడు నిత్యానందాన్నే అనుభవిస్తుంటాడు.

## 3

నారీస్తనభరనాభీదేశం, దృష్ట్వా మాగా మోహావేశం ।
ఏతన్మాంసవసాదివికారం, మనసి విచింతయ వారం వారం ॥

**వనితల వక్షస్థల శోభ, నాభీస్థల ఆకర్షణలో పడి, మోహావేశానికి పాల్పడవద్దు. అవి కేవలం శరీరంలోని మాంసము, కొవ్వులతో ఏర్పడిన ఆకారాలు మాత్రమే అని బాగుగ గ్రహించి, మాటిమాటికి ఈ సత్యాన్నే గుర్తు తెచ్చుకుంటూ ఉండు.**

రెండవ శ్లోకంలో ధనాగమతృష్ణను వీడుమని చెప్పి ఈ శ్లోకంలో స్త్రీ వ్యామోహంలో పడవద్దని హెచ్చరించుచున్నారు. యుగయుగాలుగా దేవ, మానవ, దానవ, భేదం లేకుండా, కామినీ కాంచనాలపై నున్న కాంక్ష, వ్యామోహమే, అనేక అనర్థాలకు, హత్యలకు, యుద్ధాలకు, ఘోరకృత్యాలకు మూలకారణమైనది. వేదకాలంనుండి కూడా, ఋషులు, గురువులు, పెద్దలూ, ఈ వ్యామోహంలో పడకుండా అతి జాగరూకతతో మెలగాలి సుమా అని హెచ్చరిస్తూనే వచ్చారు. అయితే, ఈ కామినీ కాంచనాలు ఇంత ఏహ్యమైనవా? ఇంత భయంకరమైనవా? కావు! వాటిలో ఏమి దోషంలేదు. వాటిపైన వ్యక్తులు పెంచుకున్న తృష్ణ వ్యామోహమే, ప్రమాదకరమైనది. ఇక్కడ స్త్రీ

యొక్క అవయవాలను పేర్కొని, స్త్రీ జాతిని కించపరచినట్లుగా భావించరాదు. అంగసౌష్టవానికి ఆకర్షితులై, పరస్పర వ్యామోహంలో పడటంలో స్త్రీ పురుషులిద్దరూ సమానమైన తోడు దొంగలే గనుక ఈ హెచ్చరిక ఇద్దరికీ వర్తిస్తుంది. కాని అహంకార, బల, దర్పాలు, విచ్చలవిడితనం, పురుషులలో ఎక్కువ గనుక నిగ్రహం, వారికే ఎక్కువ అవసరం అని ఆ విధంగా చెప్పబడింది.

మొదటినుండి, మానవుని అన్వేషణ - దుఃఖనివృత్తి, సుఖప్రాప్తి - గురించే జరుగుతూ వచ్చింది. ఈ అన్వేషణలో - ఇంద్రియాల్ని తృప్తిపరచడమే జీవితలక్ష్యంగా పెట్టుకున్నాడు కనుక అనేక బాధల్లో చిక్కుకుంటున్నాడు, మానవుడు. దుఃఖానికి అసలు కారణం ఏమిటో తెలుసుకోకుండా క్షణికమైన వాటినే శాశ్వతసుఖాలుగా భ్రమపడుతూ, అజ్ఞానంతో, అంధకారంలో, నిరంతర అన్వేషణ సాగిస్తున్నాడు. అమూల్యమైన తన మానవజీవితాన్ని వ్యర్థంగా వెళ్లబుచ్చుకుంటున్నాడు.

ఏదైనా వస్తువుయందుగాని, విషయమందుగాని, వ్యక్తియందుగాని, వ్యామోహం తగ్గించాలంటే, వేదాంతశాస్త్రంలో ఒక ప్రక్రియ ఉంది. దానిని ప్రతిపక్షభావం అని, దుఃఖదోషానుదర్శనం అని, నిరోధసంస్కారం అని, అంటారు. అంటే ఆ వస్తువు, విషయం, లేదా వ్యక్తియందలి లోపాల్ని, దోషాల్ని, దుర్గుణాల్ని ఎత్తిచూపి, దానివలన కలుగబోవు కష్ట నష్ట దుఃఖాలను తీవ్రంగా విమర్శించి, దానియందు విముఖత కలుగజేయడం అన్నమాట. ఈ సూత్రం ప్రకారం, దేన్ని గురించి అయితే తన ధన, మాన, మర్యాదల్ని, చివరకు ప్రాణాన్ని అయినా పోగొట్టుకోవడానికి వెనుదీయడో, దానియొక్క నిజ, నగ్నస్వరూపం ఏమిటి? కేవలం మాంసం, కొవ్వులతో ఏర్పడిన ఆకారాలే సుమా! అని నిష్కర్షగా విడమరచి చెప్పారు. ఈ సత్యాన్నే మాటిమాటికి గుర్తు తెచ్చుకోవడం వలన దానిపైనున్న పిచ్చి వ్యామోహం క్రమక్రమంగా క్షీణించగలదని తెలుసుకోవాలి. దేనికైనా, దాని విలువ ఎంతో, అంతే ప్రాముఖ్యత నివ్వాలి. మనుజుడు తరచూ చేస్తుండే తప్పిదం ఏమిటంటే, విలువలేని వాటికోసం ప్రాకులాడుతూ, అత్యంత విలువైన వాటిని వెనక్కి పెట్టడం. ఇలాంటి తప్పిదాలు, తప్పుడు అంచనాలు,

తప్పుడు విలువలూ, మహాత్ముల ప్రబోధాలను పాటిస్తే సరిదిద్దబడతాయి. మానవుని కివ్వబడిన విచక్షణా బుద్ధిని సద్వినియోగ పరచుకొని, నిత్యానిత్య వస్తు వివేచనచే, క్షణికమైన ఇంద్రియసుఖాల వేటనుండి విరమించుకొని, సచ్చిదానంద నిలయమైన గోవిందపదారవిందాల నాశ్రయించాలని ఆదిశంకరుల ఆదేశం.

## 4

**నళినీదళగతజలమతితరళం, తద్వత్ జీవిత మతిశయచపలం ।**
**విద్ధి, వ్యాధ్యభిమానగ్రస్తం, లోకం శోకహతం చ సమస్తం ॥**

**తామరాకు మీది నీటిబిందు వెంత తరళమై యుంటుందో (అస్థిరంగా కదులుతుంటుందో) అలాగే ఈ జీవితం కూడా అతి చపలం (చంచలం) అయినట్టిది. ఈ లోకమంతా రోగాలతోను, మానసిక దురహంకార, దుఃఖ, దురభిమానాలతోను, పీడింపబడుతూ ఉంటుందని తెలుసుకో.**

మొదటి శ్లోకాల్లో ధనాగను తృష్ణను, స్త్రీ పురుషుల శారీరక అందచందాల పట్ల వ్యామోహాన్ని వీడమని చెప్పి, ఇప్పుడు మానవజీవితమే అతి చంచలం, బుద్బుదప్రాయం, దుఃఖ భూయిష్ఠం అని చెప్తున్నారు.

వేదాంతచర్చల్లో, తామరాకు నీటి బిందువుల సహజీవనం గురించి అతి రమ్యంగా చెప్తుంటారు. నీటిలోనే పుట్టిపెరిగి, నీటితోనే నిత్యసంపర్కం కలిగియున్నను, నీటిచే తడుపబడక నిర్మలంగా నుండు తామరాకు లాగ, సంసారిక విషయాలలో మెలగుతున్నా, జ్ఞాని, స్థితప్రజ్ఞుడు, యోగి, గుణాతీతుడు, ఉత్తమభక్తుడు, అయినట్టి వ్యక్తులు ఏ విషయములచేతను అంటబడరు.

ఈ తామరాకు, నీటి బిందువు ఇంకొక సత్యాన్ని కూడ సూచిస్తుంది. నీటిబిందువు జలాశయంనుండి విడివడి, అస్థిరమైన తామరాకుపైన కొంత సమయం ఉండి, మళ్లీ జలాశయంలోనే లీనమైపోయినట్లు, జీవాత్మ పరమాత్మనుండి, విడివడి అనిత్య, అస్థిర జగత్తులో కొంతకాలం ఉండి, చివరకు పరమాత్మతో సాయుజ్యం పొందుతుంది. ఈ శ్లోకంలో తామరాకు పైనుండు నీటిబిందువు అతి చంచలంగాను, ఏ చిరుగాలి తాకిడికైనా

జారిపోయేటంతటి అస్థిరతతోను ఉన్నట్లే, మానవజీవితం కూడా అతి చపలము, అస్థిరము, అశాశ్వతము అని చెప్పబడింది. పోనీ, బ్రతికియున్న కొద్దిరోజుల్లోనైనా సుఖశాంతులతోనుండగలడా, అంటే అదీలేదు. ఆధి, వ్యాధులతోను మానావమానాలతోను దురహంకార దురభిమానాలతోను, అంతులేని శారీరిక, మానసిక బాధలు, అలజడి, అశాంతులతోను, జీవితాంతం సతమత మవుతుంటాడు. ఏ క్షణాన వచ్చిపడ్తుందో అనే మృత్యుభయంతో దిగులు పడ్తుంటాడు. అందుచేతనే బుద్ధభగవానుడు ఈ సంసారాన్ని - సర్వం దుఃఖం, దుఃఖమయం, సర్వం క్షణికం, క్షణికం - అని వర్ణించాడు. ఇలాంటి అస్థిర, అశాశ్వత, దుఃఖమయ జీవితంపట్ల మితిమీరిన మమకారం పెంచుకోడం అవివేకం అని తెలుసుకోవాలి. ఓ మూఢుడా! నీవు ఎవరి గురించి రాత్రింబవళ్లు కష్టపడి ధనార్జన చేయాలనుకుంటున్నావో వారితో నీకున్న సంబంధం ఎలాంటిదో ఆలోచించావా? విను.

## 5

**యావత్ విత్తోపార్జనశక్తః తావన్నిజపరివారోరక్తః ।**
**పశ్చాత్ జీవతి, జర్జరదేహే, వార్తాం కోఽపి న పృచ్ఛతి గేహే ॥**

**నీలో ధనార్జన శక్తి ఉన్నన్నాళ్లూ (నీవు సంపాదిస్తున్నన్నాళ్లూ) నీ పరివారం అంతా నీ యందు అనురాగం చూపుతారు. ఆ తరువాత నీ దేహంలో ముసలితనం ప్రవేశించినప్పుడు, నీ ఇంట్లోనే, నీ క్షేమసమాచారాలు ఎవ్వరూ అడగరు.**

ఈనాటి లౌకిక జీవితంలోని కఠోర సత్యాల్నే ఆచార్యులవారు ఒక్కొక్కటిగా విడమరచి చెప్తున్నారు. ప్రజల్లో ఎక్కువ మంది స్వార్థపరులే అను సత్యం ఈనాడు స్పష్టంగా కన్పిస్తుంది. ఈ శ్లోకంలో విత్తం అనే పదానికి ధనం బదులుగా సంపద అను అర్థం బాగా సరిపోతుంది. సంపద అనగా కేవలం ధనసంపదయే కాకుండా, విద్యాసంపద, కళాసంపద, నైపుణ్యసంపద, సేవానిరతి, దయాగుణం, త్యాగము, దానశీలత, అధికారము, నేతృత్వము, కార్యదక్షత మొదలగునవి అన్నీ, సంపద విశేషాలే. ఇలాంటి సంపదలున్నవారిని తమ తమ కుటుంబసభ్యులే కాకుండా, ఇతర ప్రజలు కూడా చుట్టూ చేరుతారు,

అభిమానిస్తారు, గౌరవం చూపుతారు, తమ తమ అవసరాల్ని తీర్చుకుంటారు. మంచి కళాకారుని కళను దర్శించి, ఆనందిస్తారు. దానశీలుని దాతృత్వాన్ని పొందుతారు అధికారియొక్క ఆదరణలు పొందుతారు, నాయకుడివ్వగలిగిన నేతృత్వలాభాన్ని పొందుతారు, ఈ విధంగా ఆ సంపన్నునినుండి తమకు ఏదో ఒక విధమైన ప్రయోజనం లభించేంతవరకు అతని చుట్టూ తిరుగుతారు. ముసలితనంవలనగాని, ఇతర కారణాలవలన గాని, అతనినుండి ఏమీ లభ్యం కానప్పుడు చల్లగా జారుకుంటారు. కనీసం అతని యోగక్షేమాలనైనా తెలుసుకోడానికి ఇష్టపడరు. ఇది లోకం పోకడ. దీనిని గుర్తించి, వివేకంతో మెలగమని ఆచార్యులవారి సందేశం.

లౌకికసంపదలన్నీ తాత్కాలికమైనవే. శాశ్వతవిలువగల సంపద ఒక్క ఆధ్యాత్మిక సంపదమాత్రమే. అట్లని, లౌకిక సంపదలన్నీ పనికి మాలినవని అనుకోరాదు. వాటి ప్రయోజనం, వాటికీ ఉంది. అవి మనుజునితో మరుజన్మకు పోలేవు గనుక, వాటిని ఇక్కడనే, లోకకళ్యాణం గురించి వినియోగించాలి. ఏవిధమైన ప్రతిఫలాన్ని ఆశించకుండా, నిష్కామకర్మలలో, సంపదల్ని వెచ్చించాలి. అలా చేయటంవలన పూర్వవాసనలు, కర్మలు, నశించి ఆధ్యాత్మిక ప్రగతి సిద్ధిస్తుంది. తాను చేస్తుండే లోకహితకర్మలకు బదులుగా, కనీసం కృతజ్ఞతలనైనా ఆశించడు గనుక, అయ్యో! అయిన వాళ్లంతా నన్ను అలక్ష్యం చేసి విడిచిపెట్టేశారే, అనే దైన్యభావనలు అతనికి రావు. ఎవ్వరిపట్లను ద్వేషం కలుగదు. అతడు ఎట్టి పరిస్థితుల్లోనైనా ధీరుడై, చిరునవ్వుతో ముందుకు సాగిపోతాడు. అతడే వివేకవంతుడు.

## 6

**యావత్ పవనో నివసతి దేహే, తావత్ పృచ్ఛతి కుశలం గేహే ।**
**గతవతి వాయౌ దేహాపాయే, భార్యా బిభ్యతి తస్మిన్ కాయే ॥**

**శరీరంలో ఊపిరి ఉన్నంతవరకే, ఇట్లోవారు నీ కుశలం గురించి అడుగుతారు. ఆ వాయువు కాస్తా వెళ్లిపోయి, దేహం చెడేసరికి ఆ శరీరాన్ని చూసి నీ భార్య కూడా భయపడిపోతుంది.**

ఇది సామాన్యంగా అందరికీ తెలసిన విషయమే. అయినప్పటికి, ఇలాంటి శరీరం గురించి మానవుడు తన సర్వస్వాన్ని వినియోగించి, అలంకరించి, లాలించి, పోషించి, పూజిస్తాడు. ఈ దేహాన్ని సుఖపెట్టడానికి, రక్షించడానికి, పెంచడానికి, ఎన్నెన్నో మార్గాలలో ధనసంపాదన చేస్తూ, తన జీవితం అంతా ఖర్చు చేస్తాడు. ఇన్నిచేసినా, దాన్ని ముసలితనం, రోగం క్షీణించడం, నశించడంనుండి రక్షించలేడు. అట్లని, శరీరాన్ని అలక్ష్యంచేసి, కృశింపజేసి, నశింపజేయాలని కాదు. మనిషికి శరీరం, అత్యంత అవసరం అయిన పరికరం. దాన్ని ఆరోగ్యవంతంగా పోషించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. శరీరమాద్యం ఖలు ధర్మసాధనం - అన్ని ధర్మసాధనలకు శరీరమే మొదటి సాధనం (పరికరం) - అన్నారు. అనేక జన్మల ఉత్తమ సంస్కారాలవలన మానవజన్మ లభ్యమైంది. మోక్షసాధనకు మానవ శరీరమే ఏకైక క్షేత్రం. భగవంతు డిచ్చిన ఈ అమూల్యావకాశాన్ని, అజ్ఞానం వలన మానవుడు దుర్వినియోగపరచుకొని, దుఃఖాన్ని కొని తెచ్చుకుంటున్నాడు. దేహమే దేవుడనుకొని, దాన్నే పూజిస్తూ, విలువైన ఆయుర్దాయాన్ని వెచ్చించి వేస్తున్నాడు.

పూర్వం విరోచనుడనే రాక్షసరాజు బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళి జ్ఞానోపదేశం చేయమని కోరాడట. ఆత్మధ్యానం చేయమని బ్రహ్మదేవుడు చెప్పగా, అహంకారపూరితుడైన ఆ దానవుడు, తన సంస్కారానికి అనుగుణంగా ఇలాగ ఆ ఉపదేశాన్ని అర్థం చేసుకున్నాడు. ఆత్మ అంటే "నేను", నేనంటే, నా దేహమే. దానినే నేను ఆరాధించితే జ్ఞానం వస్తుందని బ్రహ్మ ఉపదేశం- అని అనుకున్నాడు. నేటి మానవుడు చేస్తున్న పని సరిగ్గా ఇలాగే ఉంది.

జంతువులు చనిపోతే వాటి తోళ్ళు, గోళ్లు, ఎముకలు, కొవ్వు మొదలైనవి ఉపయోగపడ్తాయి గాని మానవుని కళేబరానికి ఆ మాత్రపు విలువకూడా లేదు. ఇలాంటి శరీరం గురించి మానవుడు తన విలువైన జీవితం అంతా ఖర్చుచేసేసి, గోవింద నామస్మరణం గురించి ఏమీ మిగుల్చుకోకుండా దివాలాకోరు అవుతున్నాడే - అని ఆచార్యులవారి ఆవేదన.

శరీరాన్ని పోషించు, పెంచు, దాన్ని మానవసేవకు ఉపయోగించు.

అప్పుడే దాని జన్మ సార్థకం అవుతుంది. దేహాన్ని ఒక దేవాలయంగా తయారుచెయ్యిగాని దాన్నే ఒక దేవునిగా మాత్రం ఆరాధించకు. దానికి ఎంత విలువ ఇవ్వాలో అంతే ఇవ్వు. నీ ఆధ్యాత్మిక సాధనలో తోడ్పడడానికి దానిని ఒక సేవకునిగా ఉపయోగించుకో గాని, దాని కాంక్షలను తీర్చడానికి నీవు దానికి బానిసవు కావద్దు - ఇదే ఈ శ్లోకార్థం.

## 7

**బాలస్తావత్ క్రీడాసక్తః తరుణస్తావత్ తరుణీ సక్తః ।**
**వృద్ధస్తావత్ చింతాసక్తః, పరమే బ్రహ్మణి కోఽపి న సక్తః ॥**

**బాల్యంలో క్రీడ (ఆట)ల యందాసక్తితోను, యౌవనంలో, యువతి యందాసక్తితోను, వృద్ధాప్యంలో చింతలతోను, కాలక్షేపం చేసేస్తాడేగాని, అయ్యో! ఆ పరబ్రహ్మమునందు ఎవడును అనురక్తుడు కాడు కదా!**

జీవితం పొడుగునా, తన 24 గంటల సమయాన్ని ఏవేవో వ్యాపకాలతో నింపివేస్తాడు మానవుడు. తన దేహేంద్రియాల్ని తృప్తిపరచడానికి, పరివారాన్ని సుఖపెట్టడానికి, పదితరాలకు సరిపడా సంపాదించడానికి, రాత్రీపగలూ శ్రమించి జీవితం అంతా కొట్టుకుంటాడు. మానవజన్మయే అతి దుర్లభమైనది. అమూల్యమైనట్టి ఆ అవకాశాన్ని మోక్షసాధనకై వినియోగించాలనే ఇవ్వబడింది గాని, దానిని, క్షుద్రమైన లౌకిక వ్యాపారాల్లోనే దుర్వినియోగపరచుకుంటున్నాడీ వెర్రిమానవుడు అని జాలి పడ్తున్నారు జగద్గురువులు.

దేనియందైనా ఆసక్తి, అనురాగం, సంగము కలిగితే అది మనుజుని కాళ్లకు గొలుసులాగ బంధించి, పైకి లేవనీయదు. బాల్యంలో ఆటపాటలయందుండు ఆసక్తి బంధించుతుంది. ప్రౌఢవయస్సులో సంసార బరువు బాధ్యతలు బంధించుతాయి. వృద్ధాప్యంలో అనేకరకాల చింతలు - పూర్వపు ఆశానిరాశలు, గతించిన అధికార, బలదర్పాలు, ప్రస్తుతపు అనారోగ్య శక్తిహీనతలు గురించిన చింతలు, బంధించుతాయి. జీవితం అంతా ఈ విధమైన బంధనాలతోనే సతమతమవుతుంటాడు గాని, పరబ్రహ్మను గూర్చి తెలుసుకోవడానికి ఆసక్తి చూపడు. ఇది చాలా శోచనీయ స్థితి కదా!

## 8

కాతే కాంతా కస్తే పుత్రః, సంసారోఽయమతీవ విచిత్రః, ।
కస్య త్వం వా కుత ఆయాతః, తత్త్వం చింతయ తదిహభ్రాతః ॥

**నీ భార్య ఎవరు? నీ పుత్రుడెవరు? నీవెవరివాడవు? ఎక్కడినుండి వచ్చావు? ఈ సంసారం అతి విచిత్రమైనది సుమా? ఈ తత్త్వం గురించి నీవు ఇప్పుడే బాగుగ విచారణ చేయవోయి తమ్ముడా! (భ్రాంతుడా)!**

భార్యాబిడ్డలు, సంసారం ఇవి అన్నీ మానవుని మనుగడకు అత్యవసరమైన హంగులే. వీటిని వదులుకొని పారిపొమ్మని ఎవ్వరూ చెప్పలేదు, సరికదా, వర్ణాశ్రమ ధర్మాల్లో గృహస్థాశ్రమం అతి విశిష్టమైనదిగను, జాతి అభివృద్ధికి, సమాజ సంక్షేమానికి అత్యవసరమైనట్టిదిగను గుర్తించబడింది. అవివాహితులు కేవలం తమ గురించే పాటుపడుతూ, స్వార్థపరులుగా తయారవవచ్చునేమోగాని, వివాహితులు మాత్రం తమ పరివారం గురించి కొన్ని త్యాగాలు చేయవలసి యుండటంచేత సమిష్టి క్షేమం కోరే త్యాగశీలురై యుంటారు. గృహస్థులకు సంఘజీవులుగ, సమాజంపట్ల కొన్ని బాధ్యతలు కూడా ఉంటాయి. కాని, మహాత్ములు చెప్పేదేమిటంటే, ఈ వ్యాపకాల్లోనే తగుల్కొని సంసార నిర్వహణే, పరమధ్యేయమని భ్రమపడి, అందులోనే మునిగి తేలుతూ అమూల్యమైన జీవితాన్ని వ్యర్థం చేసుకోరాదు, అని. మానవజన్మకు పరమావధి ఏమిటో, దానిని చేరడానికి ఏమి చేయాలో విచారణచేసి మెలగమన్నారు. ఈ విచారణలో మొట్టమొదటి ప్రశ్నయే "నేనెవరిని?" ఎక్కడి నుండి వచ్చాను, నా గమ్యం ఏమిటి? ఎవరికి చెందినవాడను, నా చుట్టూ ఉన్న ఈ వ్యక్తులెవరు, వీరితో నాకు ఉన్నట్టి ఈ అనుబంధం ఏమిటి - మొదలైన ప్రశ్నలకు సరియైన సమాధానాల నన్వేషించాలి.

మనమంతా ఒక తీర్థయాత్రా స్పెషల్ రైలు బండిలోని ప్రయాణికుల వంటివారము. ఎక్కడెక్కడి వ్యక్తులో వచ్చి చేరుతారు. వాళ్లలో కొంతమందితో మనకు సన్నిహితమైన స్నేహం ఏర్పడుతుంది. ఒకరి కష్టసుఖాలు వేరొకరు పంచుకుంటాం. పరస్పరం సేవలు చేసుకుంటాం. వరసలు కట్టుకుంటాం.

యాత్రలలో కలసిమెలసి తిరుగుతూ అనేకమైన అనుభవాలను పొందుతూ, ఆనందిస్తూ గడిపివేస్తాం. యాత్ర ముగియగానే ఎవరు దిగవలసిన ఊళ్లో వారు దిగిపోయి వెళ్లిపోతాం. అంతటితో ఆ అనుబంధం సరి. అదేవిధంగా, జీవియొక్క అనంతయాత్రలో లెక్కలేనన్ని మజిలీలుంటాయి. ఒక్కొక్క మజిలీలో అనేకమందితో సంబంధాలేర్పడతాయి. ఈ సంబంధాలన్నీ తాత్కాలికమైనవే. ఈ సత్యాన్ని గ్రహించలేక, వాటికి శాశ్వతమైన విలువల నిచ్చి, బంధనాల నేర్పరుచుకొని దుఃఖాన్ని కొని తెచ్చుకుంటున్నాడు మానవుడు. ఈ బాంధవ్యాల యధార్థతత్త్వాన్ని తెలుసుకోరా తమ్ముడూ అని అతివాత్సల్యంతో ఆచార్యులవారు చెప్పారు. కొన్ని పుస్తకాల్లో భ్రాతః బదులుగా, భ్రాంతః అని ఉన్నది. భ్రాంతి జెందినవాడా అని అర్థం. ఈ పదం కూడా ఈ సందర్భానికి సరిపోతుంది.

## 9

సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం ।
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం, నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః ॥

**సత్‌సంగము వలన నిస్సంగం (సంగరాహిత్యం) ఏర్పడుతుంది. నిస్సంగం వలన దేనియందూ వ్యామోహం కలుగకుండా ఉంటుంది. వ్యామోహంలేని మనస్సు నిశ్చలంగా ప్రశాంతంగా వుంటుంది. ఇలాంటి నిశ్చలతత్త్వమే సత్యశోధనకు అనువైన స్థితి అయి, జీవన్ముక్తిని సాధిస్తుంది.**

నిస్సంగం (అసంగం, సంగరాహిత్యం) అనగా దేనియందూ, ఏవిధమైన అనురక్తి లేకుండడం. సంగము (ప్రగాఢమైన అనుబంధం) వస్తువులందు, వ్యక్తులందు, విషయాలందు ఏర్పడుతుంది. సంగము సంకెళ్లవలె మానవుని బంధించి వేస్తుంది. ప్రాపంచిక విషయాల్లో, లౌకిక వ్యాపారాల్లో తగుల్కొంటున్న కొద్దీ ఈ బంధనాలు మరింత దృఢమైపోతాయి. దీనికి విరుగుడు సత్సంగమే అని పేర్కొన్నారు. సత్సంగమంటే సజ్జనులతోను, సత్‌గ్రంథములతోను, సత్‌చింతనలతోను, సత్ కర్మలతోను, సత్ స్వరూపునితోను సంగము (సాంగత్యము, సంపర్కము) ఏర్పరచుకోవడం, సత్సంగం మానవునికి ఎనలేని మేలును చేకూర్చుతుంది. సత్సంగమహిమల్ని గూర్చి అనేకమైన

ఉదంతాలు చెప్పబడ్డాయి. సత్సంగమే జీవన్ముక్తికి ప్రథమ సోపానంగా ఈ శ్లోకంలో చెప్పారు. సత్సంగమువలన మనుజుడు, తన గమ్యమేమిటో, ఏది సత్యమో, ఏది నిత్యమో, దేనిని పొందాలో, దేనిని త్యజించాలో, అనే విషయాల్లో విచక్షణా జ్ఞానాన్ని పొంది, పెంపొందించుకోగలడు. సత్పురుషుల నుండి సత్ గ్రంథాలనుండి, ఆధ్యాత్మిక సత్యాలను సాధన సూత్రాలను తెలుసుకోగలడు. సంకుచితమైన స్వార్థప్రయోజనాలనుండి, అతని దృక్పథం విశాలమయి, సమాజ సంక్షేమం, సర్వమానవ కళ్యాణాలవైపు వికసిస్తుంది. నేను, నాది, అనే ఆలోచనలు తగ్గుతున్న కొద్దీ, అతను ఎదుగుతుంటాడు. దేనియందూ అతనికి సంగము ఏర్పడదు. వస్తువులందు, విషయాలందు, వ్యక్తులందు, అతనికి ఎలాంటి వ్యామోహమూ పుట్టదు. సంగము, వ్యామోహము, లేని వ్యక్తికి ఆశనిరాశలు, మానావమానాలు, రాగద్వేషాలు అంటవు. ద్వంద్వాలకు అతీతమైన మనసు నిశ్చలమవుతుంది. నిత్యము ప్రశాంతమవుతుంది. చిత్తశుద్ధి కలుగుతుంది. శుద్ధచిత్తమే ఆత్మ దర్శనానికి అనువైనక్షేత్రం. పరిశుద్ధహృదయమందిరమే పరమాత్ముడు ప్రకాశించు స్థానం. ఈ విధంగా సత్సంగమే పరమాత్ముని చెంతకు చేర్చునట్టి పువ్వుల బాటలో ప్రథమ సోపానం.

గృహస్థులు సంసారబాధ్యతలనుండి పారిపోయి సన్న్యసించమని గురువులు చెప్పలేదు, సరికదా, అన్ని బాధ్యతల్నీ సక్రమంగా నిర్వహించి, దేనియందూ తగుల్కొనక, అనిత్యమైన వస్తు, విషయ, వ్యక్తులకు, ఎంత విలువ నివ్వాలో అంతే ఇస్తూ, సత్సంగాల్లో పాల్గొని, నిశ్చలతత్త్వాన్ని, జీవన్ముక్తిని సాధించాలి అన్నారు.

## 10

వయసి గతే కః కామవికారః, శుష్కే నీరే కః కాసారః ।
క్షీణే విత్తే కః పరివారో, జ్ఞాతే తత్త్వే కః సంసారః ॥

**వయసు గతించి, యౌవనం క్షీణిస్తే, ఇక కామవికారం (తృష్ణ) ఎక్కడుంటుంది? నీరు ఎండిపోతే ఇక చెరువు ఎక్కడుంటుంది? సిరిసంపదలు హరించుకుపోతే ఇక ఆశ్రితజనాలెక్కడ ఉంటారు? తత్త్వజ్ఞానం కలిగితే, ఇక సంసార వ్యామోహం ఎక్కడుంటుంది?**

ఒక కారణం ఉంటేనేగాని ఏ కార్యమూ జరుగదు. కామతృష్ణ విజృంభించడానికి వెనుకనున్న కారణం - వయసుతోపాటు ఉరుకుతున్న యౌవనపు పొంగు. ఒక లోతైన స్థలం చెరువు అనిపించుకోవడానికి కారణం దాని నిండా ఊరి, చేరి, నిలిచియున్న నీరు. ఒక వ్యక్తి చుట్టూ చేరి, మనుష్యులు ఆశ్రయించుకొని ఉండటానికి కారణం, అతని వద్దనున్న సిరిసంపదలు. మానవుడు మిథ్యాసంసారాన్ని పట్టుకొని వేలాడటానికి కారణం, అతని అవిద్య కార్యకారణ న్యాయం ప్రకారం కారణాన్ని తొలగిస్తే కార్యం ఉండదు.

వాసన లనబడు జలాలు నిండియున్నప్పుడే మనసు, మానస సరోవరం అయి యుంటుంది. వాసనలు ఖర్చయిపోయినప్పుడు సరోవరం ఎండిపోయి, ఆలోచనా బీజాలు మాడిపోతాయి. అట్టి క్షేత్రాన్ని అలికి, శుద్ధముచేసి ఆసనం వేసి, ఆత్మారాముని ఆహ్వానించాలి. ఇక్కడ సంసారం అంటే పూర్వ సంస్కార కర్మలతో కూడిన వాసనా మయమైన మనస్సు. ఈ మనస్సే సకల కర్మలకు ఉత్పత్తిస్థానం. మనస్సును సరస్సుగను, జలాలు వాసనలుగను, జలచరాలు నీటి లతలు, ఆకులు, పువ్వులు, కర్మలుగను గ్రహించాలి. తత్త్వజ్ఞానం కలిగిన తరువాత, అనగా జ్ఞాన భాస్కరుని తాపంచే నీరు (వాసనలు) ఎండిపోయి జలజీవాలు (కర్మలు) మాడిపోయిన తరువాత చెరువువలె, సంసారం అదృశ్యమైపోతుంది.

అవిద్య, మాయయొక్క అంశము. లేనిది ఉన్నట్టుగను, ఉన్నది లేనట్టుగను కనుపింపజేయడం మాయయొక్క లక్షణం. కొయ్యమీద ఆరబెట్టబడి, గాలికి కదలుతున్న గుడ్డ, చీకటిలో భూతం అను భ్రమను కలిగిస్తుంది. చీకటిలో త్రాడు, పాము అనే భ్రమను కల్గిస్తుంది. ఈ భ్రమలకు చీకటి అనబడు అవిద్యయే కారణం. వెలుగు ప్రవేశించగానే చీకటి అదృశ్యమై, భ్రమతొలగి, కొయ్యమీది గుడ్డ, తాడు, యధాతథంగా కనిపిస్తాయి. అక్కడ భూతంగాని, పాముగాని అసలేలేవు. కాని అవి ఉన్నట్టుగా భ్రమ, భయం కలగడానికి కారణం చీకటి, అవిద్య. అలాగే, అంతా అన్నింటా వ్యాపించియున్న పరమాత్మ బదులుగా అవిద్యవలన మానవునకు కన్పించేది నానారూప గుణాలతో భూతంలాగ నాట్యం చేస్తున్న ప్రపంచం. దీనినే సంసారం

అంటారు. ఈ సంసారంయొక్క మిథ్యా స్వరూపాన్ని తెలుసుకున్న తరువాత ఇక ఆ సంసారమనేది ఎక్కడుంటుంది? వెలుగు రాగానే అదృశ్యమైన భూతంలాగ సంసారం అదృశ్యమౌతుంది. ఈ సంసారబంధాల బాధల నుండి విముక్తి పొందాలంటే నిజతత్త్వానుభూతిని కలిగించునట్టి జ్ఞానాన్ని సంపాదించాలి.

జటిలమైన వేదాంత సూక్ష్మాన్ని చిన్న చిన్న ఉపమానాలతో సులువుగా అర్థమయ్యేటట్టు చెప్పడం ఆదిశంకరుల ప్రత్యేకత.

## 11

**మా కురు ధనజనయౌవనగర్వం, హరతి నిమేషాత్ కాలః సర్వం ।**
**మాయామయమిదమఖిలం బుద్ధ్వా, బ్రహ్మపదం త్వం ప్రవిశ విదిత్వా ॥**

**నీకు విశేషమైన ధనమున్నదనిగాని, ప్రజల మద్దతు ఉన్నదనిగాని, యౌవన శక్తి ఉన్నదనిగాని గర్వించకు. వీటివన్నిటిని కాలం ఒక్క నిముషంలోనే హరించి వేయగలదు సుమా! ఇదంతా మాయామయం అని గుర్తించి, బ్రహ్మపదాన్ని తెలుసుకొని, అందు ప్రవేశించు.**

వెనుకటి శ్లోకాల్లో ధనము, ధనాగమ తృష్ణలవలన కలుగు ప్రతిబంధకాల గురించి చెప్పి, ఇప్పుడు తన ధన సంపదలను చూచి గర్వించవద్దని చెప్తున్నారు. ధనము ఎంత నిలకడ లేనిదో, ధనాన్ని చూచి, చుట్టూ చేరు మందీ, మార్బలం వారిచ్చు అండదండలు కూడా అంత నిలకడ లేనివే. ఇక యౌవనం తెచ్చి పెట్టు అంగబలం, కండబలం, శక్తిసామర్థ్యాలు మాత్రం శాశ్వతమా అంటే, కానే కాదు. వ్యాధుల వలన, వార్ధక్యం వలన అవి కృశించి నశించునట్టివి. ధనబలం, జనబలం, యౌవనబలం అన్నీ తాత్కాలిక మైనట్టివే. కాలం యొక్క తాకిడికి తట్టుకోలేక హరించుకు పోయేటట్టివే! ప్రాణవాయువుతో పాటు అన్నీ గతించి పోతాయి. కాలము దోపిడి దొంగలాగ, ప్రాణంతో సహా అన్నిటినీ అపహరించుకొనిపోతుంది. మాయామయం అఖిలం - సర్వమూ మాయచే ఆవరింపబడియున్నది. మాయ అంటే, ఒకప్పుడున్నట్టు కన్పించి, తరువాత కనిపించనిది - క్షణికములు, బుద్బుదప్రాయాలు, లేదా అసలే

లేనివి ఉన్నట్టు కనిపించునట్టిది - భ్రమలు, ఎండమావులు. మానవుడు గర్వించుచుండు ఈ ధన జన యౌవనాది సంపదలన్నీ మాయతో కూడి యున్నట్టి క్షణభంగురాలు. కాలగర్భంలో ఎప్పుడు కలిసిపోతాయో తెలియలేనట్టివి. వీటిని పట్టుకొని విర్రవీగకోయీ, వెర్రినాయనా! శాశ్వతమైన బ్రహ్మపదాన్ని చేరడానికి మార్గం జూపే జ్ఞానాన్ని సంపాదించు. గోవిందుని భజించి, అనుగ్రహం పొందు అన్నారు ఆచార్యులవారు.

## 12

**దినయామిన్యౌ సాయం ప్రాతః, శిశిరవసంతౌ పునరాయాతః ।**
**కాలః క్రీడతి గచ్ఛత్యాయుః, తదపి న ముంచత్యాశావాయుః ॥**

**రాత్రీపగళ్లు, ఉదయం సాయంసంధ్యలు, శిశిర వసంతాది ఋతువులు, క్రమం తప్పకుండా ఒకదానివెనుక ఒకటిగా, వస్తూపోతూ, చక్రంలాగ తిరుగుతూ ఉంటే, కాలం, వినోదంగా ఆడుకుంటూ, ఆయువును హరించుకుపోతుంటే, మానవుడు మాత్రం తన ఆశా, కాంక్ష, మమకారాల గూడును విడువకుండా అంటిపెట్టుకుని ఉంటాడు.**

భగవంతుని సృష్టిలో కాలగమనం అతి అద్భుతమైనది. నియమబద్ధంగా, నిర్ణీతక్రమంలో, నిర్విరామంగా, కాలచక్రం తిరుగుతూనే ఉంటుంది. ఉషోదయం, పగలు, సాయంసంధ్య, రాత్రి, మళ్లీ ఉషోదయం, ఈ విధంగానే రోజులు వారాలు గాను, వారాలు నెలలుగాను, నెలలు - వసంత, గ్రీష్మ, వర్ష, శరత్, హేమంత, శిశిర, మరల, వసంత ఋతువులుగాను, ఋతువులు సంవత్సరాలుగాను, మారి మారి, కాలచక్రం సాగిపోతూనే ఉంటుంది. దాని గమనాన్ని ఎవరూ అడ్డుకోలేరు. అది ఎవరికోసమూ ఆగదు. ఈ విధంగా కాలము, నటరాజ నృత్యంలాగ, లయబద్ధంగా నాట్యం చేసుకుంటూ పోతూ, తన పాదాలక్రింద అనేక జీవరాశుల కాలాన్ని అణగద్రొక్కి హరించివేస్తుంది. ఇది ప్రకృతిసిద్ధమైన సంహారక్రియ.

జన్మదినాలు జరిపించుకుంటూ సంతోషిస్తాడు మానవుడు. కాని ఒక్కొక్క సంవత్సరం గడుస్తుంటే, తన నిష్క్రమణద్వారం దగ్గరకు ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తున్నట్టుగా గ్రహించడు. పాపం! ఈ లోకంలో ఇంకా

పదికాలాలుంటాను అనుకొని పథకాలు వేస్తుంటాడు. (హరతి నిమేషాత్ కాలః సర్వం) ఒక్కక్షణంలో సర్వమూ హరించి వేయడానికి కాలం కాచుకొని ఉంటుందని గుర్తుంచుకోడు.

ఈ ఆశాపాశాలను సడలించుకొని ఈ జగన్నాటకరంగస్థలాన్ని విడిచిపెట్టేలోగానే, చేయవలసిన సత్కర్మలన్నీ చేసివేయాలి. అమూల్యమైన ఈ మానవజన్మను క్షుద్రమైన లౌకికవ్యాపారాల్లో వ్యర్థం చేయరాదు. ఆధ్యాత్మికచింతనను, తరువాత ఎప్పుడో తీరికగా చేసుకోవచ్చులే అనుకోరాదు. ఆ మంచి రోజు రాకముందే కాలం మనపై కాలు వేయవచ్చు .అందుచేత, నీ ఆశామోహాలు వీడి, కర్తవ్యం తెలుసుకొని, గమ్యంవైపు సాగిపో! అనునది ఈ శ్లోకంలోని ఉపదేశం.

## 13

**కాతే కాంతా ధనగతచింతా, వాతుల కిం తవ నాస్తి నియంతా ।**
**త్రిజగతి సజ్జనసంగతిరేకా, భవతి భవార్ణవతరణే నౌకా ॥**

**ఓయీ వాతులా! కామినీ కాంచనాల గురించే నీకెందుకయ్యా ఇంతయాతన? చింతన చేయడానికి నీకు ఈశ్వరుడు లేడా? సంసార సాగరాన్ని దాటించగల నౌక, ఈ ముల్లోకాల్లోనూ ఒక్కటే ఉంది - అదే సజ్జనసాంగత్యమని తెలుసుకో!**

వాతుల అంటే కేవలం మూర్ఖుడే కాదు ఇంద్రియలోలుడు కూడాను. కాతే కాంత, ధనగత చింత? భార్య గురించి, భాగ్యం గురించి నీకీ చింత ఎక్కడినుంచి పుట్టుకొచ్చిందోయ్? చింతించడానికి నీకు మరి విషయాలేలేవా? నీకు దేవుడంటూ ఎవరూ లేరా? దైవచింతన చేయరాదా? ఈ కామినీ కాంచనాలగురించిన చింతలు నిన్నేమైనా ఉద్ధరించేవా? అని అడుగుతున్నారు.

మానవుణ్ణి సంసార విషచక్రానికి బంధించి ఉంచునట్టిది ఈ రెండింటిపట్ల నుండు వ్యామోహమే. దీనివలన అతడు తన శక్తుల్ని కోల్పోయి, కేవలం ఇంద్రియలోలుడుగనో, లేదా ధనార్జన చేసే యంత్రంగానో మిగిలిపోతాడు. ఇక ఎలాంటి సత్కర్మల్నీ చేయడానికి అతనికి సమయం చిక్కదు, శక్తి ఉండదు. అలాంటి ఆలోచనలే రావు. ఇక్కడ, "భార్య, ధనము, ఉండ

కూడనివి", అని చెప్పినట్టు భావించరాదు. గృహస్థధర్మ నిర్వహణలో భార్య సహధర్మచారిణి. ఆమెకు గృహలక్ష్మిగా, మాతృమూర్తిగా, అతి పవిత్రమైన స్థానం ఇవ్వబడింది. కాని ఆమెను కామతృష్ణ తీర్చుకొనే సాధనంగాను, బిడ్డల్ని కనే యంత్రంగాను, హీనపరచరాదన్నారు. అలాగే ధనార్జన కూడాను - నిజకర్మోపాత్తంగా, ధర్మయుతంగాను, చేసినట్టిదై యుండాలి. పరోపకారానికి, లోకకల్యాణానికి వెచ్చించబడాలి. గాని, వ్యామోహంతో కూడిన ధనాగమతృష్ణ భార్యాలోలత్వం, పతనానికి దారితీస్తాయి.

అయితే సరియైన జీవనవిధానం ఏమిటి, సంసారబంధనాల్లో చిక్కుకోకుండా ఈ లోకంలో మసలడం ఎట్లా - దీనికి ఆచార్యులు వారే చెప్పారు. త్రిజగతి సజ్జనసంగతిరేకా, భవతి భవార్ణవతరణే నౌకా - ఈ మూడు లోకాల్లోనూ సజ్జనసాంగత్యమే - తరుణోపాయం అని. ఇక్కడ సజ్జనసాంగత్యం ఎంత మహత్తర మైనదో చెప్పబడింది. సజ్జనులంటే కేవలం మంచివారేకాదు. సత్+జనః = సజ్జనః అనగా సత్ వస్తువుతోను, సత్ విషయములతోను, సత్ గ్రంథాలతోను, సత్ చింతనలతో, సదాచార వ్యవహారాలతోను కూడియున్న జనులు, ఇట్టి వారి సందర్శన, సంపర్క, సంభాషణ సాన్నిహిత్యాలే చాలు, మానవుణ్ణి మంచి మార్గాల్లో పెట్టటానికి, ఇదే మహాత్ముల గొప్పతనం. వారు చూపించే మార్గాన సాగిపోతే గమ్యం చేరడం తథ్యం అన్నారు శంకరాచార్యులు.

ఇంతటితో ద్వాదశ మంజరికస్తోత్రం ముగిసింది. వీటిని శంకరులవారే స్వయంగా చెప్పినట్లును తరువాతి 14 శ్లోకాలను శిష్యులు చెప్పినట్లును, అంటారు.

## 14

**జటిలో ముండీ లుంచితకేశః, కాషాయాంబర బహుకృతవేషః ।**
**పశ్యన్నపి చ న పశ్యతి మూఢో హ్యుదరనిమిత్తం బహుకృతవేషః ॥**

**జడలు కట్టిన జుట్టు కలవాడైనను, గుండుగా గీయబడిన తలగలవాడైనను, వెంట్రుకల్ని ఒక్కొక్కటిగా పీకివేయబడిన తల గలవాడైనను, కాషాయ**

**వస్త్రం ధరించిన వాడైనను, ఇలాంటి అనేకమైన వేషాలు వేసినవాడైనను, చూస్తూ కూడా, ఏమీ చూడనట్టి మూఢుడే, ఏలనన, ఈ వేషాలన్నీ కేవలం ఉదరపోషణకోసం వేసినవే గనుక.**

ఈ శ్లోకాన్ని శ్రీపద్మపాదాచార్యులు చెప్పారట. సన్న్యాసాశ్రమం అతి పవిత్రమైన చరమదశగా గౌరవింపబడినట్టిది. సన్న్యాసులకు సమాజంలో గౌరవ, ప్రేమ, ఆదర, అతిథ్యాలు లభించేవి. వారు లోక కళ్యాణం గురించి పాటుపడే మహాత్ములుగా పరిగణింపబడేవారు. ఇంతటి మహత్తర గౌరవాన్ని సులువుగా చేజిక్కించుకోవచ్చుననే ఆశతో, ఎట్టి సాధనా చేయకుండా, కష్టపడలేని సోమరులు, కపటవేషధారులు కొందరు, సాధు సన్న్యాసులుగా వేషాలుకట్టి, ప్రజల్ని మోసగించి, వారి ఆతిథ్యాలు ఆరగిస్తూ, పొట్టపోషించుకొనే వృత్తికి అలవాటు పడేవారి నుద్దేశించి ఈ శ్లోకం చెప్పబడింది. ఇలాంటివారు పవిత్రమైన సన్న్యాసాశ్రమానికి ఎంత కళంకాన్ని తెచ్చిపెడ్తున్నారో, అనే ఆవేదనతో చెప్పబడింది.

తక్కువ పనితో ఎక్కువ ఫలితాన్ని - minimum effort, maximum comfort పొందాలనుకునే వారు - సోమరులు, స్వార్థపరులు. అసలు ఏ పనీ చేయకుండా ఫలితాన్నంతా తామే పొందాలనుకునే వారు లోక కంటకులు. వీరు ఇతరులు కృషిచేసి ఉత్పత్తి చేసిన దానిని దోచుకొని అనుభవించే మనస్తత్వం కలవారు. ఇలాంటి వారు అన్ని కాలాల్లోనూ ఉన్నారు. ఎట్టి అర్హతలూ లేకపోయినా, కపట వేషధారణలోనే ప్రజల్ని మభ్యపెట్టి మహాత్ములుగా చలామణీ అవాలని ప్రయత్నించే బూటకపు సన్న్యాసులు ఈ తెగకు చెందినవారు. తక్కువ శ్రమతో ఎక్కువలాభం పొందాలనుకునేది, ఇప్పుడొక లలితకళ అయిపోయింది. పొట్టకూటికి, మానవుడు చేయరాని ఘోరకృత్యాలన్నీ చేస్తూ, బహుకృతవేషాలేస్తూ, మానవత్వాన్నే మరచిపోయి, తన గమ్యం ఏమిటో తెలియని మూఢుడై కొట్టుకుంటున్నాడు. శంకరుల కాలంలో, ఉదర నిమిత్తమై, ఏ కొద్దిమందో కపటసాధువులు తయారయ్యారేమోగాని, నేడు మాత్రం ఎక్కడ చూసినా, ప్రతీరంగంలోనూ, కపట వ్యక్తులే వర్ధిల్లుతున్నారు. ఇది కేవలం ఉదరనిమిత్తమేనా? కాదు, కాదు! కామినీ కాంచనాలపై

తనివితీరని కాంక్ష, అదుపులేని దురహంకారం, మమకారం, వలన కలిగిన తృష్ణ వీటికి వశుడైన మానవుడు **పశ్యన్న పి చ న పశ్యతి మూఢః** - చూస్తూ ఉన్నా ఏమీ కానలేని మూఢుడైపోతాడు. ఆత్మతత్త్వాన్ని ఎన్నటికీ తెలుసుకోలేడు.

## 15

**అంగం గళితం, పలితం ముండం, దశనవిహీనం జాతం తుండం ।**
**వృద్ధో యాతి గృహీత్వా దండం, తదపి నముంచత్యాశాపిండం ॥**

**శరీరం శిథిలమైపోయింది, తల నెరిసిపోయింది, దంతాలు లేని నోరు బోసిపోయింది, వృద్ధుడు కర్ర పట్టుకొని తిరుగుతాడు. అయినా, అతడు తన కోరికల మూటను విడిచిపెట్టడు కదా!**

ఈ శ్లోకాన్ని శ్రీతోటకాచార్యులు చెప్పారట. ముసలితనంలో నున్న వ్యక్తిని చక్కగా వర్ణించారు. యౌవనం ఉరకలు వేస్తున్న యువకునికి అనేక రకాలైన ఆశలుండడం సహజమే గాని, జవసత్వాలుడిగిపోయి, నిలవడానికి శక్తిలేక చేతికర్ర సహాయంతో తిరుగుతూ ఏదైనా తినడానికి పళ్లులేక, శిథిలమైన శరీరంతో తెల్లబడిన జుట్టు, ముడతలు పడిన చర్మంతో వికారంగా కనిపించే ముదుసలికి కూడా ఆశలుంటాయా? ఉంటాయి. మిక్కుటంగానే ఉంటాయి అని చెప్పారు. ఎలాగంటే, చిన్నప్పటి అనుభవాలు మళ్లీ పొందాలనే తహతహతోపాటు, తీరని కోరికల తీవ్రత ఎక్కువై, ఎప్పటికైనా అవి తీరాలనే కాంక్ష అతన్ని చుట్టుముట్టుతుంది. ఒకవేళ కోరుకున్నవి లభ్యమైనా, అనుభవించడానికి శరీరానికి శక్తిలేక, నిస్పృహలు చెలరేగి, నరకయాతన కలిగిస్తాయి.

ఈ తీరని కాంక్షల సముదాయమే, వాసనారూపంగా తయారయి, ప్రస్తుతజన్మలో సాధ్యపడకపోతే ముందు జన్మలలోనైనా అనుభవింపజేస్తాయి గాని విడిచిపెట్టవు. అందుకే చెప్పారు శరీరం శిథిలం అవుతున్నా మానవుడు తన ఆశల మూటను మాత్రం విడిచిపెట్టడు - అని. ముందుజన్మకు తీసుకెళ్తాడు.

అయితే మార్గాంతరం ఏమిటి? యౌవనం ఉన్నప్పుడే, శరీరంలో శక్తి ఉన్నప్పుడే మనోబుద్ధులు సక్రమంగా పనిచేస్తున్నప్పుడే, నిగ్రహాశక్తిని పెంచుకొని, కోరికలను తగ్గించుకుంటూ క్రమంగా తొలగించుకోవడానికి కృషి చేస్తుండాలి. దృఢసంకల్పంతో, ఇంద్రియాలను, మనస్సును, విషయాలవెంట పరుగెత్త నీయకుండా అదుపులోనుంచుకోవాలి. అలాగ నిగ్రహింపబడిన ఇంద్రియ మనోబుద్ధుల్ని గోవిందనామస్మరణలో వినియోగించాలి. ఈ సాధనను అభ్యసించిన వ్యక్తికి వృద్ధాప్యం ఒక మధురగానంలాగ, నందనవనంలో నాట్యంలాగ, గోవిందనామస్మరణానందంలో, నిత్యం తేలియాడుతుంది. అంతేకాక, కోరికలే ఉండవు గనుక, తీరని కోరికలు అసలే ఉండవు. కొత్త వాసన లేర్పడవు. ఉత్తమజన్మలు సిద్ధించి, జన్మరాహిత్యం కలుగుతుంది.

## 16

**అగ్రే వహ్నిః పృష్ఠే భానుః రాత్రౌ చుబుకసమర్పితజానుః ।**
**కరతలభిక్షస్తరుతలవాసః, తదపి న ముంచత్యాశా పాశః ॥**

**పగలు సూర్యునివైపు వీపును, ముందరకు చలిమంటను పెట్టుకొని, రాత్రులందు మోకాళ్లకు గడ్డాన్ని ఆనించి ముడుచుకుంటూ, భిక్షాపాత్ర బదులుగ దోసిట్లోనే భిక్ష తీసుకొని తింటూ, చెట్టుకిందనే కాలం గడుపుతున్న వ్యక్తి కూడా, ఆశాపాశాన్ని తొలగించుకోడు.**

శ్లోకాన్ని శ్రీహస్తామలకుడు చెప్పెను. వెనుకటి శ్లోకంలో అవసానదశలో నున్నను కోరికలను ఒదులుకోలేని ఒక వృద్ధగృహస్థుని దైన్యావస్థను వర్ణించి, ఇక్కడొక సర్వసంగ పరిత్యాగి యైన సన్న్యాసియొక్క అవస్థను కళ్లకు కట్టినట్టుగా చిత్రించారు.

కనీసావసరాలైన కూడు, గుడ్డ, గూడులను కూడ త్యజించివేసి, ఎండా వానలలోను, చలిమంచుల్లోను, చెట్టుకింద తలదాచుకుంటూ, నేలమీద నిద్రిస్తూ దోసిట్లోనే భిక్ష తీసుకొని తింటూ, ఒంటిమీద గుడ్డలు లేకుండా ముడుచుకొని నిద్రిస్తూ కాలం గడిపే వ్యక్తి సన్న్యాసి అనిపించుకుంటాడు. ఇవి అన్నీ బాహ్యమైన వస్తువుల్ని అవి తెచ్చిపెట్టు శారీరక సుఖాల్నీ, త్యాగం

చేయడం మాత్రమే. ఇవి, సహనము, తితీక్షలనూ, శరీరంమీది ఆధిపత్యాన్నీ, వృద్ధి చేయడానికి తోడ్పడగలవు. కాని, నిజమైన సన్న్యాసం అంటే ఆంతరంగిక విషయ సంగత్యాగము, మనసులోని కోరికల కల్మష ప్రక్షాళనము అన్నమాట. ఈ కల్మషం, పూర్తిగా నిర్మూలింపబడనంత వరకు, బాహ్యసాధనాల వలన ప్రయోజనం స్వల్పమే. ఇది సర్వసుఖాలను త్యజించివేసిన సాధువులనైననూ, చివరివరకు అంటిపెట్టుకొని ఉంటూ, ముందు జన్మలకు కూడ వెంబడిస్తుంది. మానసిక సన్న్యాసం లేకుండా శారీరక సుఖత్యాగాలు వ్యర్థములే అను సత్యాన్ని, కొందరు రాక్షసుల గాథల వలన స్పష్టమౌతుంది. వారు తీవ్రమైన కోరికలు పెట్టుకొని, సర్వసుఖాలను ఒదులుకొని, ఘోరతపస్సులు చేసి, స్వార్థపూరితమైన వరాలను పొంది, లోకకంటకులుగా తయారై నశించారేగాని, త్యాగము, తపస్సులయొక్క సత్ఫలితాలను పొందలేదు. మనస్సులోని కోరికల్ని అణగదొక్కి, మానసికంగా అనుభవిస్తూ బాహ్యసాధనలు చేసేవారు మిథ్యాచారులు (గీత 3-6). అణగదొక్కబడినవి ఏవైనా, ఒక్కసారిగ విజృంభిస్తాయి. గనుక కోరికల్ని అసలే చేరనివ్వరాదు. చేరినా బుజ్జగించి, దారిమళ్లించి, తొలగించుకోవాలే గాని, బలవంతంగా అణగదొక్కే ప్రయత్నం చేస్తే బెడిసికొడ్తుంది.

## 17

**కురుతే గంగా సాగరగమనం, వ్రతపరిపాలనమథవా దానం ।**
**జ్ఞానవిహీనః సర్వమతేన, ముక్తిం న భజతి జన్మశతేన ॥**

**గంగాసాగర సంగమానికి తీర్థయాత్రకు వెళ్తాడు. వ్రతాలుచేసి, మొక్కుబడులు చెల్లిస్తాడు, దానధర్మాలు చేస్తాడు, కాని, ఆత్మానుభూతిని పొందలేని జ్ఞానహీనుడు మాత్రం ఏ సిద్ధాంతం ప్రకారమైనా, వందజన్మలు గడిచినా, ముక్తిని పొందలేడు.**

శ్రీసుబోధుడు చెప్పిన ఈ శ్లోకం వెనుకటి శ్లోకంలోని భావాన్నే విశదీకరిస్తుంది. శరీరం శిథిలమై చావసిద్ధంగా నున్నా, పాతస్మృతుల్నీ, కోరికల్నీ, చింతల్నీ, విడువలేని వృద్ధులూ, పొట్టపోషణకు అనేక వేషధారణలు చేసే కపట సాధువులూ, శరీర సుఖాన్ని త్యజించి, దేహాన్ని కష్టపెట్టి, కృశింపచేసి, కోరికల్ని విడిచిపెట్టలేక, మనోమాలిన్యాన్ని తుడిచిపెట్టలేక,

సాధనలు చేసే సన్న్యాసులూ, ఎలాంటి వ్యర్థజీవితాల్ని గడుపుతున్నారో చెప్పి, ఇప్పుడు తీర్థయాత్రలు, వ్రతాలు, మొక్కుబడులు వంటి బాహ్యామైన భక్తి ప్రక్రియలు కూడా నిరర్థకాలే అని చెప్తున్నారు.

గంగాసాగరం అంటే గంగానది సాగరంలో సంగమం అయ్యే స్థలం అని గాని, కాశీక్షేత్రంలోని గంగ అనిగాని - రామేశ్వరంలోని సాగరం అనిగాని చెప్పవచ్చు. ఈ మూడూ పవిత్రమైన పుణ్యక్షేత్రాలే. భక్తితో తీర్థయాత్రలు చేసే సాంప్రదాయం అనాదిగా వస్తున్నది. పూర్వం కాలినడకన వెళ్లేవారు గనుక, దారిలో అనేక స్థలాలను చూచి, ప్రజలతో సంపర్కించి, కష్టసుఖాల్ని సహించి, మహాత్ముల దర్శనంచేసి, వారి సందేశాల్ని విని, భక్తి జ్ఞాన వైరాగ్యాలు పెంచుకొన గలగడం ఈ యాత్రల యొక్క సత్ ప్రయోజనం. అలాగే, పూజలు, వ్రతాలు, ఒక నియమ నిష్ఠల పద్ధతిని, మనోనిగ్రహాన్ని, త్యాగాన్ని, భక్తిప్రపత్తుల్ని, పెంచుకోడానికి ఉద్దేశించబడినవి. దానధర్మాలవలన పేదలకు, దీనజనులకు సహాయం చేకూర్చే సామాజిక ప్రయోజనం కలగడమే కాక, దయార్ద్రత, హృదయ విశాలత, దాతలయందు కలగడానికి అవకాశం ఏర్పడుతుంది. ఈ సాధనాల వెనుక, గృహస్థుడైన కర్తకు, ఏదో ఒక కామ్యార్థం ఉండడం కద్దు. కామ్యఫల సిద్ధికై ఆచరింపబడిన కర్మలు మోక్షప్రదాలు కావు. తీర్థయాత్రాది సత్కర్మల వలన పుణ్యం లభిస్తుంది. ఈ పుణ్యసంచయం వలన ఉత్తమజన్మలు రావచ్చు. స్వర్గప్రాప్తికూడా కలుగవచ్చు. గాని అవి అన్నీ పునర్జన్మ కారకాలే. క్షీణేపుణ్యే మర్త్యలోకం విశంతి పుణ్యం ఖర్చయిపోగానే స్వర్గలోకంనుండి, మళ్లీ మానవలోకంలో జన్మించాలి, గాని పునర్జన్మ లేని మోక్షం సిద్ధించదు. ఈ విధంగా, గృహస్థులు ప్రతినిత్యం కామ్యఫల సిద్ధి గురించి ఇటువంటి ఏదో ఒక సత్కర్మ చేస్తూ ఉన్నా, మోక్షసిద్ధికి కావలసిన ఆధ్యాత్మిక జ్ఞానసాధనలు చేపట్టరు కదా! వీరు ఈ విధంగానే ప్రతీజన్మలోనూ కొనసాగిస్తూ ఉంటే, వందజన్మలు గడిచినా మోక్షాన్ని పొందలేరు.

ఇక్కడ "సర్వమతేన" అనే పదానికి అర్థం - ఏమతసిద్ధాంత ప్రకారం చూసినా, జ్ఞానం రానిదే మోక్షం సిద్ధించదు - అనేది నిర్వివాదాంశము, అని.

## 18

సురమందిర తరుమూలనివాసః, శయ్యాభూతలమజినం వాసః ।
సర్వపరిగ్రహ భోగత్యాగః కస్య సుఖం న కరోతి విరాగః ॥

**దేవాలయంలో ఏదో ఒకచెట్టుకింద నివసిస్తూ, కటిక నేలమీదనే శయనిస్తూ, జింకచర్మాన్ని ధరిస్తూ, దేనినైనా స్వీకరించాలి, అనుభవించాలి అనే ఉద్దేశ్యాన్ని తోసిపుచ్చుతూ, ఉండే వ్యక్తికి, వైరాగ్యం అపరిమితానందాన్నివ్వకుండా ఉంటుందా?**

16వ శ్లోకంలో శ్రీహస్తామలకుడు కపటయోగి గురించి చెప్పాడు. ఇప్పుడు శ్రీసురేశ్వరాచార్యుడు నిజమైన సన్న్యాసి ఎలా ఉంటాడో చెప్పాడు. నిజమైన సన్న్యాసి దేనినీ స్వీకరింపనిష్టపడడు. తనకున్న సర్వస్వాన్ని అందరికిచ్చేసి, వారి ఆనందాన్ని చూసి తాను ఆనందిస్తాడు. త్యాగంలో ఉన్న మహత్తే అది. అతడు తనగురించి ఏమీ కావాలనుకోడు. ఏది, ఎప్పుడు ఎక్కడ లభ్యమైతే దానితోనే తృప్తిజెంది, శరీరసుఖాన్ని వదులుకొని మనసులో ఎలాంటి కోరికల్ని చేరనీయక, పరిపూర్ణ వైరాగ్యంతో, తనయొక్క సచ్చిదానంద తత్త్వాన్ని గుర్తించినవాడై, ఎల్లప్పుడూ ఆనందిస్తూ ఉంటాడు. నిజమైన విరాగియే, నిత్యానందాన్ని అనుభవించగలడు. రారాజులు, ధనిక చక్రవర్తులు మహాశక్తిమంతులు, సర్వాధికారాలున్నవారు, ఎన్ని ఉన్నా, అన్నీ ఉన్నా, ఏదో ఒకదాని గురించి నిత్యమూ చింతిస్తూ, యాతన పడ్తూనే ఉంటారు. కాని, వైరాగ్యనిష్ఠుడు మాత్రం ఎల్లప్పుడూ నిశ్చింతుడై, సుఖసంతోషాలతో నిండియుంటాడు. అతనికి అది కావాలి, ఇది కావాలి అనే ధ్యాసగాని, తనకున్నదేదో పోతుందనే చింతగాని, ఏమీ ఉండవు. చెట్టునీడయే ఒక సౌధం. భూతలమే పట్టుపరుపు. దోసిలి పట్టిన చేతులే అక్షయపాత్ర, జింక చర్మమే పట్టువస్త్రం. చెట్టులిచ్చిన పండ్లు కాయలే పంచభక్ష్యాలు. నదులిచ్చిన స్వాదుజలాలే అమృతపానీయాలు. ఇలాంటి ప్రకృతిమాత బిడ్డలకు ఎటుచూసినా ఆనందమే తప్ప, ఆశానిరాశలు, రాగద్వేషాలు, అహంకార మమకారాలూ, దరిజేరవు. వీరు పరమాత్మకు అతి సన్నిహితంగా ఎదిగినవారు. పరమానందం ఇలాంటి విరాగుల్ని తప్ప ఇంకెవరిని వరిస్తుంది? అంటున్నారు శ్రీసురేశ్వరాచార్యులు.

## 19

**యోగరతో వా భోగరతో వా, సంగరతో వా సంగవిహీనః ।**
**యస్య బ్రహ్మణి రమతే చిత్తం, నందతి నందతి నందత్యేవ ॥**

**బ్రహ్మమందు రమించు బ్రహ్మజ్ఞాని యొక్క ఆనందమే ఆనందం. అతడు, యోగాభ్యాసరతుడైనా, భోగాలననుభవించువాడైనా, విషయ, వస్తు, జనసమూహాల యందాసక్తుడైయున్నా, వాటియందెట్టి ఆసక్తిలేని ఏకాంత వాసియైనా, అతని చిత్తం ఎల్లప్పుడూ, బ్రహ్మమునందే రమిస్తూ ఉంటుంది గనుక, అతడు బ్రహ్మానందంలోనే తేలియాడుతుంటాడు.**

బ్రహ్మజ్ఞానం కలిగిన వ్యక్తి బ్రహ్మమందే ఎల్లప్పుడూ రమిస్తుంటాడు. అతనికి బ్రహ్మసత్యం, జగన్మిథ్య. ఈ లోకంలోని వ్యాపారాలన్నీ - అనగా యోగాభ్యాసాలూ, భోగానుభవాలూ, వస్తు విషయ, వ్యక్తులతో సంగము కలిగి యుండడమూ, ఎలాంటి సంగమూ లేకుండడమూ, ఇవి అన్నీ - ఈ మిథ్యా జగన్నాటకంలోని నటనలే అని తెలుసు. స్వప్నంలోని సంఘటనలు ఎంత నిజమో, ఇవి కూడ అతని దృష్టిలో స్వప్నతుల్యాలే. శరీరం కర్మ చేస్తున్నా, తాను మాత్రం దేనినీ అంటకుండా సాక్షిగానే ఉంటాడు. ఈ స్థితికి ఎదిగిన వ్యక్తి, ఏ పనిని చేసినా, ఏమీ చేయనివాడే అనబడ్తాడు. ఎందుకంటే, అతనికి దేనియందూ కర్తృత్వభోక్తృత్వ భావాలుండవు గనుక, అతడు లోకకళ్యాణం గురించే నిష్కామకర్మ చేస్తూంటాడు గనుక. అతనివలన ఏ దుష్కర్మా జరుగదు. సర్జను ఆపరేషన్ చేస్తుండగా పేషెంటు చనిపోతే అతనిని హంతకుడని దండించరు కదా! అలాగే జ్ఞాని ప్రపంచంలోని కార్యకలాపాల్లో పాల్గొంటున్నా అతనికి కర్మబంధమేర్పడదు. అతడేమి చేస్తున్నా ఏమీ చేయకున్నా, బ్రహ్మమందే రమిస్తుంటాడు - నందతి నందతి నందతి ఏవ-ఆనందిస్తూనే ఉంటాడు అని శ్రీనిత్యానందుడు చెప్పాడు.

## 20

**భగవద్గీతా కించిదధీతా, గంగాజలలవకణికా పీతా ।**
**సకృదపి యేన మురారి సమర్చా, క్రియతే తస్య యమేన న చర్చా ॥**

**ఎవడైతే భగవద్గీతను కొంచెమైనా అధ్యయనం చేస్తాడో, గంగాజలాన్ని కొంచెమైనా ఆచమనం చేస్తాడో, శ్రీహరిని ఒక్కసారి అయినా అర్చన చేస్తాడో, అతని గురించి యముడేమీ పట్టించుకోడు. (అతనికి జనన మరణ భయముండదు).**

ఈ శ్లోకం శ్రీఆనందగిరిచే చెప్పబడింది. ఆధ్యాత్మిక ప్రగతికి ఇక్కడ మూడు దివ్యమైన సాధనాలు చెప్పబడినవి. 1. గీతాధ్యయనం, 2. గంగాజల సేవనం, 3. మురారి పాదసేవనం.

ఉపనిషత్తుల సారమైన భగవద్గీతాధ్యయనంవలన మానవజీవిత లక్ష్యము, దానిని చేరు మార్గము తెలుస్తాయి. మానవునికి అందుబాటులో లేని ఆకాశగంగను భగీరథుడు అనేక ప్రయత్నాలతో భూమిమీదకు అవతరింపజేసాడు. ఆ ప్రవాహధాటిని భరించి మందమందంగా భూమిమీదకు విడవడానికి ఆ పరమశివుని ఒప్పించాడు. ఇది గంగానదియొక్క పురాణగాథ. ఆధ్యాత్మికంగా, ఈ ఆకాశగంగ ఒక జ్ఞానవాహిని. దీనిని పరమశివుడు పరిగ్రహించి, ఋషులద్వారా, పరంపరాగతంగా సాధకులకు అందజేసినట్లు భావించాలి. ఈ జ్ఞానగంగాజలాన్ని ఆస్వాదించడమే ఇక్కడి భావం. ఋషుల వారసులైన సద్గురువులే భక్తులకు భగవంతునితో సంధానం చేయగల సమర్థులు. మనదేశంలోని గంగానది దివ్యమైన ఆకాశగంగకు ప్రతీకం. అందుకే దానికి అంత పవిత్రత లభించింది. దాని తీరాన అనేకులైన మహాత్ములు యజ్ఞయాగాలు, తపస్సులు చేసి ఆ నదిని పునీతం చేసారు. హిమాలయంలోని ఓషధులు, ఆ జలాల పవిత్రతను, రోగనివారకశక్తిని ఇనుమడింపజేసాయి. అందుచేతనే మానవుడు భక్తి విశ్వాసాలతో, ఆ జలాలలో స్నానం చేసినా, ఆ గంగాజలాన్ని తాగినా, ఆశించిన ఫలం పొందుతాడు. ముర అను రాక్షసుని శత్రువు మురారి (శ్రీహరి). ముర అంటే అహంకారం అని కూడా అంటారు. అహంకారానికి శత్రువు శ్రీహరిపాదాలు. ఆ మురారిని సేవిస్తే సకల కర్మలు, పాపఫలాలు నశిస్తాయి.

భగవద్గీతాధ్యయనం ద్వారా గమ్యాన్ని తెలుసుకొని, జ్ఞానగంగనాస్వాదిస్తూ మురారిని ధ్యానిస్తూ పరమాత్మను చేరాలి అని ఈ శ్లోకంలోని ఉపదేశం.

పరమాత్మను జేరినవారికి ఇక పునర్జన్మ ఉండదు. జన్మలేనిదే మరణముండదు. మరణములేని చోట ఇక యమునికి ప్రమేయమే ఉండదు.

## 21

**పునరపి జననం పునరపి మరణం, పునరపి జననీజఠరే శయనం ।**
**ఇహ సంసారే బహు దుస్తారే, కృపయాఽపారే పాహి మురారే ॥**

**మళ్లీ జననం, మళ్లీ మరణం, మళ్లీ మాతృగర్భంలో పడి ఉండడం. ఈ సంసారచక్రభ్రమణం తప్పించుకోలేనంత దుస్తరమైనది. ఓ మురారీ! అపారకృపతో నన్ను ఈ సంసారంనుండి రక్షించు ప్రభో!**

జననమరణరూపమైన ఈ సంసారచక్రం జీవుని బంధించివేసి నిర్విరామంగా తిప్పుతూనే ఉంటుంది. జీవుడు తనంతట తానే వెళ్లి ఆ చక్రభ్రమణంలోకి ఆకర్షితుడై పూర్వకర్మ బంధనాలనబడే దారాలతో ఆ చక్రానికి కట్టేసుకుంటాడు. కర్మఫలాన్ని అనుభవిస్తుంటే ఆ దారపుపోగులు తెగుతున్నా కొత్తకర్మల వలన కొత్త దారపుపోగులు చేరుతుంటాయి. ఈ విధంగా బంధము కొనసాగుతూనే ఉంటుంది. దీనినుండి బైట పడ్డడానికి మూడే మార్గాలున్నవి.

ప్రారబ్ధకర్మల ననుభవిస్తూ, భగవదర్పణ భావంతో, లోకకళ్యాణం గురించి నిష్కామకర్మలు చేస్తుంటే, పూర్వవాసనలు ఖర్చయి, కొత్తవాసనలు చేరకుండా ఉండి, వాసనాక్షయ మవగానే సంసారచక్రం నుండి బైటపడవచ్చు ఇది కర్మ యోగమార్గము.

శ్రీహరి పాదపద్మాలకు నవవిధ భక్తి సాధనలతో సేవజేసి భగవదనుగ్రహం వలన పూర్వకర్మల బంధం నుండి విముక్తిని పొందడం భక్తియోగమార్గము.

వేదాంతశాస్త్రాధ్యయనం (భగవద్గీతా, ఉపనిషత్తులు మొ॥) ద్వారా శ్రవణ, మనన, నిధిధ్యాసాది సాధనలతో నిరంతర ఆత్మధ్యానం చేస్తూ బ్రహ్మజ్ఞానం పొందితే ఆ జ్ఞానాగ్నిలో సకలకర్మలు కాలిపోయి, ముక్తిని పొందడం జ్ఞానయోగమార్గము.

జీవునికి మాతృగర్భంలో పడినప్పుడు ప్రారంభమైన వేదనలు, మరణం తరువాత కూడ వెంటపడుతూనే ఉంటాయి. జన్మ దుఃఖం, ఆధి వ్యాధులు దుఃఖం, వృద్ధాప్యం దుఃఖం, రోగపీడలు దుఃఖం, మరణం దుఃఖం ఇవి కాకుండా అహంకార మమకారాల వలన కలిగిన దుఃఖాలు, దారిద్ర్యం, ఈతిబాధల వలన కలిగిన దుఃఖాలు, ఈ విధంగా దుఃఖపరంపరలు జీవిని చిత్రహింసచేసేస్తాయి. అందుకే పునరపిజననం, పునరపి మరణం, ఒద్దుబాబోయ్ అని ప్రార్థిస్తాడు. జన్మతోనే వస్తున్న ఈ దుఃఖాలు జన్మలేకుండా చేసుకుంటేగాని విడిచిపెట్టవు. ఈ దుఃఖసాగరాన్ని దాటడానికి భగవానుని శరణు వేడడమే ఏకైకమార్గం. భజగోవిందం, భజగోవిందం - అన్నారు, ఆచార్యులవారు.

## 22

**రథ్యాచర్పట విరచిత కంథః, పుణ్యాపుణ్య వివర్జితపంథః ।**
**యోగీ యోగ నియోజిత చిత్తో, రమతే బాలోన్మత్తవదేవ ॥**

**దారిలో దొరికిన గుడ్డపేలికలతో చేయబడిన బొంతను చుట్టుకొని, పుణ్యాపాపాలకు అతీతమైన మార్గాన చరిస్తూ, యోగమందే చిత్తాన్ని నిల్పియుంచు యోగి, పసిబాలునివలె, పిచ్చివానివలె ఆనందిస్తుంటాడు.**

యస్య బ్రహ్మణి రమతే చిత్తం, నందతి, నందతి, నందతి ఏవ అని 19వ శ్లోకం చెప్పిన నిత్యానందుడే ఈ శ్లోకాన్ని కూడ చెప్పడం చేత అదే భావాన్ని వేరువిధంగా చెప్పెను.

భగవద్గీతలో చెప్పబడిన స్థితప్రజ్ఞుడు, జ్ఞాని, ఉత్తమయోగి, ఆదర్శభక్తుడు, గుణాతీతుడు, దైవీగుణ సంభూతుడు, ప్రపంచంలో ఎలాగ ప్రవర్తిస్తారో ఈ శ్లోకంలోని యోగి లక్షణాలు కూడా అలాగే ఉన్నవి. బ్రహ్మమందే (ఆత్మయందే) రమించు యోగికి తన చుట్టూ ఉన్న చరాచర సృష్టి అంతా బ్రహ్మమయంగానే కన్పిస్తుంది. తాను సమాజం నుండి ఏమీ కోరడు. అవసరం అయితే సమాజం గురించి తన ప్రాణాన్నైనా ఆనందంగా అర్పించివేస్తాడు. ఎవరికీ అక్కరలేని, పారవేసిన గుడ్డ పేలికలతో చేయబడిన బొంతయే చాలు అతని అవసరాలు తీర్చడానికి. అతని మనోబుద్ధులు ఆత్మయందే లగ్నమైయుండి,

శరీరం మాత్రం జీవించియుండాలి గనుక కనీస అవసరాలైన తిండి, తీర్థం, నిద్రలను ఎక్కడో ఒకచోట లభ్యమైతే గ్రహిస్తాడు లేకుంటే ఊరుకుంటాడు. ఇలాంటి వ్యక్తికి విధినిషేధాలు లేవు. అతని ప్రవృత్తి పాపపుణ్యాలకు అతీతంగా వుంటుంది. అతనికి కర్తృత్వ భోక్తృత్వాలుండవు. గనుక జరిగిపోయిన విషయాల గురించి ఆవేదనగాని, ఆనందంగాని ఉండదు. రేపటి గురించి ఆదుర్దా ఉండదు. కల్లాకపట మెరుగని పసిపాపవలె, ఎట్టి చీకూ చింతా, రాగద్వేషాలు లేకుండా, నిష్కల్మషంగా నవ్వుతూ ఆనందిస్తుంటాడు. మన మధ్యనే ఉంటున్నా, పిచ్చివానివలె, తనదైన మరో ప్రపంచం - ఆత్మసామ్రాజ్యంలోనే విహరిస్తూ ఆనందిస్తుంటాడు.

## 23

**కస్త్వం, కోఽహం, కుత ఆయాతః, కామే జననీ, కో మే తాతః ।**
**ఇతి పరిభావయ సర్వమసారం, విశ్వం త్యక్త్వా స్వప్నవిచారం ॥**

**నీ వెవరవు, నేనెవరిని, ఎక్కడినుండి వచ్చావు, నా తల్లి ఎవరు, తండ్రీ ఎవరు? ఈ విధంగా శోధించు. నిస్సారమైన, స్వప్నంలాంటి ఈ విశ్వాన్ని గురించి వ్యర్థపు ఆలోచనలు కట్టిపెట్టి, తత్త్వవిచారణ చెయ్యి (అన్నారు శ్రీయోగానందులు)**

నిన్ను నీవు తెలుసుకో - అన్నారు శ్రీరమణమహర్షి. ఈ "నేను" అంటే ఎవరో, ఏమిటో తెలుసుకోవడమే, తత్త్వవిచారంలో మొదటి చరణం. మానవుడు, తన చుట్టూ ఉన్న సకల వస్తువిషయాల గురించి, శాఖోపశాఖలుగా క్షుణ్ణంగా, సంవత్సరాలకొద్దీ, తరతరాలుగా అధ్యయనంచేసి, అనేక గ్రంథాలు చదివి, వ్రాసి, ప్రపంచజ్ఞానం పెంచుకుంటున్నాడు గాని, తన గురించీ, తానెవరో ఎక్కడినుండి వచ్చాడో, తన తల్లీ తండ్రీ అని పిలవబడే వ్యక్తులెవరో, తనకూ, తన చుట్టూ ఉన్న వ్యక్తులకు, విషయాలకు, వస్తువులకు, మధ్యనున్న సంబంధం ఎట్టిదో, అని ఈ విధమైన విచారణ చేయడు.

విశ్వం అంటే మనకు కనిపించేది, కనుపించనిది అయిన పంచభూతాత్మకమైన ప్రపంచమే కాకుండా, సమస్త అనుభవ ప్రపంచం

కూడా కలసి యున్నది. ఈ విశ్వం క్షణక్షణానికి మారుతూ, పుట్టుతూ, నశిస్తూ అస్థిరమూ, అశాశ్వతమూ అయినట్టిది గనుక స్వప్నతుల్య మనబడినది. ఇలాంటి విశ్వం గురించిన ఆలోచనల్ని కట్టిపెట్టి, ఆత్మను గూర్చి యోచిస్తే, జీవిత పరమార్థాన్ని తెలుసుకోగలవు అని చెప్పబడింది.

## 24

**త్వయి మయి చాన్యత్రైకో విష్ణుః, వ్యర్థం కుప్యసి మయ్యసహిష్ణుః ।**
**భవ సమచిత్తః సర్వత్ర త్వం, వాంఛస్యచిరాద్యది విష్ణుత్వం ॥**

**నీలోను, నాలోను, ఇతరులందరిలోను, అంతటను వ్యాపించియున్నది ఆ విష్ణువు మాత్రమే. ఈ పరమసత్యాన్ని అవగాహన చేసుకోలేని నీవు, పదే పదే చెప్పబడుతున్న ఈ విషయం గురించి వినే ఓపిక లేని నీవు, అనవసరంగా చిరాకు పడ్తున్నట్టున్నావుగాని, ఇది మాత్రం సత్యం. నీవు విష్ణుపదాన్ని త్వరగా పొందదలచుకుంటే, అన్ని పరిస్థితులందూ సమచిత్తత్వాన్ని కలిగియుండాలి.**

వేదాంత బోధనలో ఏదైనా ఒక విషయాన్ని అవగాహన అయ్యేవరకు పదే పదే చెప్తుండడం ఒక సాంప్రదాయం. కొత్తగా చేరినవారు, ఓరిమి లేనివారు, అయిన కొందరు శిష్యులు అసహనం చూపుతారు. ఇది అధ్యయనానికి పనికిరాదు. ఎంతో ఓరిమి, సహనం ఉండాలి. తొందరపాటు, చిరాకు పడరాదు. అందుచేతనే సమచిత్తుడవు కమ్మని అన్నారు. భగవద్గీతలో కూడ సమత్వం యోగికి, జ్ఞానికి, చాలా అవసరం అని చెప్పబడింది.

సమచిత్తాన్ని సాధించడానికి - 1. ఈశ్వరార్పణ భావంతో సర్వకర్మల్ని చేయాలి, 2. పరమేశ్వరునిపైన అచంచలభక్తి కలిగియుండాలి. 3. మానవసేవయే మాధవసేవయని విశ్వసించి, ఆచరించాలి, 4. నిరంతర స్వాధ్యాయం, చింతన, విచారణ చేస్తుండాలి. 5. సత్య స్వరూపాన్ని ధ్యానిస్తుండాలి. ఇలాంటి సాధన చేయడంవలన విష్ణువే అంతటా, అందరిలోనూ వ్యాపించి యున్నట్లు తెలుసుకొని విష్ణుపదాన్ని పొందడం సుగమమవుతుందని భావము.

## 25

శత్రౌ మిత్రే పుత్రే బంధౌ, మాకురు యత్నం విగ్రహ సంధౌ ।
సర్వస్మిన్నపి పశ్యాత్మానాం, సర్వత్రోఽథ సృజ, భేదా జ్ఞానం ॥

**శత్రువులతోనైనా, మిత్రులతోనైనా, పుత్రులతోనైనా, బంధువులతోనైనా, ఎవ్వరితోనైనా, విరోధించడం, సంధిచేసుకోవడంలాంటి ప్రయత్నాలు చేయకు. అందరి యందూ, అంతటా ఆత్మనే దర్శిస్తూ, అజ్ఞానం వలన కలిగిన భేదభావాన్ని ఎక్కడా లేకుండా పీకిపారవేయి.**

శరీరమంతా తనదే అయినప్పుడు ఎవరైనా ఒక అంగాన్ని ప్రేమించి, ఇంకొక అంగాన్ని ద్వేషిస్తాడా? కోర్టులో బాగా వాదించి, కేసును గెల్పించిన నాలుకకు మిఠాయి తినిపించి ముద్దుచేస్తాడా, లేదా పరుగుపందెంలో ఓడిపోతే కాళ్లను చిదగ్గొట్టి శిక్షిస్తాడా? అలాగే ఈ విశ్వమంతా పరమాత్మయొక్క విరాట్ స్వరూపమై, అందులో నేనొక సూక్ష్మ అంగమైనప్పుడు, నేను ఇంకొక అంగాన్ని ప్రేమించడంగాని, ద్వేషించడంగాని ఎలా సంభవిస్తుంది? ఇదే ఈ శ్లోక కర్త భావము. "నాయనా! ఎవ్వరితోనైనా పోట్లాడటంలోను, స్నేహం చేయటంలోను, నీ సమయం, శక్తి సామర్థ్యాలు వ్యర్థం చేసుకోకు. శత్రువు, మిత్రుడు, పుత్రుడు, బంధువులుగా కనిపించే వీరంతా ఎవరనుకుంటున్నావు? నీలాగానే ఆత్మస్వరూపులు, ఒకే ఆత్మయొక్క కిరణాలు. ఆ ఒకే ఒక ఆత్మను అంతటా అన్నిటియందు దర్శించు. ఆత్మకు భిన్నంగా ఏమీలేదు. భిన్నత్వం ఉందనుకోవడం అజ్ఞానం." అని ఈ శ్లోకం అర్థం.

బల్బులో నున్న విద్యుత్‌శక్తి, పంకాలోనున్న విద్యుత్ శక్తి ఒక్కటే. పరికరాల (ఉపాధుల)లో నున్న మార్పుచేత వేరుగా కన్పించవచ్చు. విద్యుత్ శాస్త్ర జ్ఞానికి తెలుసు ఈ పరికరాల యందే కాదు, ఈ విశ్వమంతా వ్యాపించియున్నది ఒకే ఒక విద్యుత్‌శక్తి అని. అందుచేత ఆత్మ విభిన్నంగా నున్నదనే అపోహ ఏకోశాన ఉన్నా తీసి పారవేయి అని చెప్పబడినది.

## 26

**కామం క్రోధం లోభం మోహం త్యక్త్వాఽఽత్మానం పశ్యతి సోఽహం।**
**ఆత్మజ్ఞానవిహీనా మూఢాః, తే పచ్యంతే నరకనిగూఢాః ॥**

**కామం (కోరిక), క్రోధం, లోభం, మోహం, వీటిని విడిచిపెట్టేసి, సాధకుడు, తనయందే, ఆత్మను సోహం (అతడే నేను) అని దర్శించగలడు. ఆత్మజ్ఞానం పొందని మూఢులు నిగూఢమైన నరకంలో చిత్రహింసలకు లోనౌతారు.**

ఈ శ్లోకాన్ని భారతీవంశ అను శిష్యుడు చెప్పాడు. మానవుడు ఆత్మ స్వరూపుడు. కాని, ఈ సత్యాన్ని అతడు గుర్తించకుండా, అతనిని మభ్యపెట్టి, ఒక మూఢునిగజేసి, శరీరంలోని బందీగజేసి, ఆడిస్తున్నారు - కామం, క్రోధం, లోభం, మోహం, అనబడు నలుగురు దుండగులు. వారి ప్రభావం, శక్తియుక్తులు అతి బలీయమైనవి.

కోరిక మనసులో ప్రవేశించగానే దానినెలాగైనా సాధించాలనే కాంక్ష ఎక్కువై, ఆ ప్రయత్నంలోనే మనస్సు నిమగ్నమైయుంటుంది. కోరిక తీరినా తీరకపోయినా కోపం వస్తుంది - తీరకపోతే అడ్డుపడిన వ్యక్తి పైన, తీరితే, ఇంతేనా, ఇంకా కావాలి, అని తృప్తి లేక. క్రోధం ఆవేశించినప్పుడు విచక్షణాజ్ఞానం నశించి, ఎంతటి దారుణ కృత్యమైనా చేయడానికి వెనుదీయదు మనస్సు. లోభము, కోరికలకు పుట్టినిల్లు. ఎంత ఉన్నా తనకే చాలదు, ఉన్నది తరిగిపోతే ఎలాగు? ఇంకా ఇంకా కావాలి అనే దురాశ, తృప్తిలేకపోడం, తనకున్నది ఇతరులకుండరాదనే మత్సరం, ఇవి అన్నీ లోభలక్షణాలు. మోహం అంటే భ్రమ, వ్యామోహం, ఉన్నది ఉన్నట్టుగా కాక, వేరు విధంగా చూడడం. దేనిపైనైనా ప్రగాఢ కాంక్ష ఏర్పడి, అదే సర్వస్వం, అది లేకపోతే జీవితమే వ్యర్థం అనుకునే పిచ్చిభ్రమయే వ్యామోహం. కామం, క్రోధం, లోభం, మోహం ఈ నాలుగూ, మనసును కలుషితం చేసి, ఎప్పుడూ అలజడి, అశాంతులతోనే నాట్యం చేయిస్తుంటాయి. ఇలాంటి మనసుగల వ్యక్తి మూఢుడే! అతనికి ఆత్మదర్శనం మాట అటు ఉంచి, సుఖశాంతులే, లేకుండా పోతాయి. "తే పచ్యంతే నరకనిగూఢా" అలాంటివారు, నిగూఢమైన నరకంలో మాడిపోతారు. నరకం అంటే ఎక్కడో ఉన్న దనుకోనక్కరలేదు. ఈ కామక్రోధ లోభమోహాలతో ఎల్లప్పుడూ కుతకుత లాడుతున్న మనస్సే ఘోరమైన నరకంగా తయారయి, మనిషిని అనేక చిత్రహింసలకు గురిచేస్తుంది. చేయరాని పనులను చేయిస్తుంది, అవమానాలు తెచ్చిపెడ్తుంది, శత్రువుల్ని

ఆకర్షిస్తుంది. కుట్రలు, కావేషాలు, సంఘవిద్రోహాలు, పలాయనాలులాంటి కార్యకలాపాల్లో ముంచివేసి, ఒక్కక్షణమైనా సుఖశాంతులు లేకుండా చేస్తుంది. ఈ దుస్థితినుండి తప్పించుకోవాలంటే కామం క్రోధం లోభం మోహం, త్యక్త్వా, ఆత్మానం పశ్యతి సోఽహం - ఈ నలుగురు దుండగుల్ని తరిమివేసి, మనోబుద్ధుల్ని ఆత్మధ్యానంలో నిలిపి, ఆత్మదర్శనం చేయాలి. అప్పుడు సాధకుడు సః అహం (అతడే నేను) అహం బ్రహ్మాస్మి (ఆ బ్రహ్మమే నేను) అని తెలుసుకుంటాడు. ఆత్మ ఎక్కడోలేదు. మనలోనే ఉన్నది. మనం గుర్తించలేకుండా అడ్డుపడ్తున్న ఈ ఆవరణలను తొలగించుకోవాలి. మెడలోనే ఉన్న కంఠాభరణాన్ని మరచిపోయి ఇల్లంతా వెదుకుతున్న స్త్రీ వలె, ఆత్మ గురించి విశ్వమంతా వెదుకుతున్నాము. ఆత్మజ్ఞానం ద్వారానే ఇలాంటి భ్రమలు తొలుగుతాయి. ఆత్మజ్ఞానంలేనివారు మూఢులు, నిగూఢనరకంలో మగ్గిపోతారు అని చెప్పారు.

## 27

**గేయం గీతా నామసహస్రం, ధ్యేయం శ్రీపతి రూపమజస్రం ।**
**నేయం సజ్జనసంగే చిత్తం, దేయం దీనజనాయ చ విత్తం ॥**

**భగవద్గీతను, సహస్రనామాలను గానం చేస్తుండాలి. ఎల్లప్పుడూ శ్రీపతి రూపాన్నే ధ్యానిస్తుండాలి. చిత్తాన్ని సజ్జన సాంగత్యం వైపుకే నడుపుతుండాలి, ద్రవ్యాన్ని (ధనాన్ని) దీనజనుల కిస్తుండాలి.**

దీనితో, శిష్యులచే చెప్పబడిన చతుర్దశ మంజరిక ముగిసినది. దీనిని శ్రీసుమతి చెప్పాడు. వెనుకటి శ్లోకాల్లో ఆత్మను తెలుసుకోవాలి. ఆత్మజ్ఞానం లేని మూఢులు నరకం అనుభవిస్తారని స్పష్టం చేసారు. ఈ శ్లోకంలో, అందరి ఉపదేశాల సారమంతా, నాలుగు సూత్రాలలో చెప్పబడింది.

1. భగవద్గీతాధ్యయనం చేయాలి, శ్రీవిష్ణు సహస్రనామ గానం చేయాలి, 2. శ్రీహరి రూపాన్ని ధ్యానం చేస్తుండాలి, 3. సజ్జన సాంగత్యంలోనే చిత్తాన్ని నియోగించుతుండాలి, 4. నారాయణ స్వరూపులైన దీనజనులకు ధన, ద్రవ్య, సహాయం చేస్తుండాలి.

ఉపనిషత్తుల సారమైన భగవద్గీతాధ్యయనంవలన మానవుని గమ్యం, దానిని చేరు విధానాలూ, తెలుస్తాయి. శ్రీవిష్ణు సహస్రనామపారాయణం వలన ఆ పరమాత్మయొక్క దివ్యనామగుణవైభవాలు, సర్వవ్యాపకత్వం, మనస్సుకు పట్టి, పరమాత్మ ధ్యానానికి సహాయపడ్తుంది. ఈ రెండు సాధనల వలన, నిరంతర శ్రీహరి ధ్యానఫలం పొందవచ్చు.

సత్సంగము, దీనజనసేవ, ఈ రెండున్నూ సాధనలకు సుగమం చేసే రెండు చక్కని రాజమార్గాలు. సత్సంగమనగా సాధుసజ్జన భాగవతులతో సాంగత్యమే కాకుండా, సద్గ్రంథపఠనం, సత్కార్యాచరణ, సత్యశోధనం కూడాను. సత్సంగము ద్వారానే గీతా, నామసహస్రాది సద్ గ్రంథాధ్యయనం, భగవత్ భక్తి సాధనలు పెంపొందగలవు. దీనజనసేవ అతి ముఖ్యసాధనంగా గ్రహించాలి. మిగిలినవన్నీ వాచా వేదాంతంగా నిలిచిపోయే అవకాశమున్నది గాని, దీనజనసేవ ప్రత్యక్షప్రమాణము లివ్వగలది. దీనజనుల సేవ దేవదేవుని సేవకంటెమిన్న. దీనిని శ్రద్ధాపూర్వకంగా నిర్వహించడానికి సాధకుని హృదయం దయార్ద్రతలతో కరిగిపోవాలి. హృదయం విశాలమవ్వాలి. దయ కరుణ, క్షమ, సహనం, దానశీలత, ప్రేమ, హృదయంలో పొంగిపొరలితే గాని ఇది సాధ్యపడదు. మనలో భగవద్భక్తి ఎంతవరకు పెరిగిందో తెలుసుకోడానికి మన హృదయస్పందనే ఒక గీటురాయి.

గోవిందుని చెంతకు చేరడానికి ఈ నాలుగు సూత్రాలు సాధన చాలును అన్నారు.

## 28

**సుఖతః క్రియతే రామాభోగః, పశ్చాత్ హంత శరీరే రోగః ।**
**యద్యపి లోకే మరణం శరణం, తదపి న ముంచతి పాపాచరణం ॥**

**ఇంద్రియ విషయలోలుడై సుఖాన్ని అనుభవించాలనుకుంటాడుగాని, మానవుడు, పాపం! తరువాత, రోగాల్లో చిక్కుకుంటాడు. ఈ లోకంలో, చివరకు మరణమే శరణం అని తెలిసియున్నను, అతడు మాత్రం పాపకృత్యాలు చేయడం మానడు! ఎంత దౌర్భాగ్యం!**

ఈ చివరి నాలుగు శ్లోకాలూ శంకరుల వారే చెప్పారట. పరిణామక్రమంలో పర్వతం ఎక్కుతున్నకొద్దీ, కష్టం ఎక్కువౌతుంటుంది. కొంతవరకు ఎక్కిన తరువాత, శ్రమకు భయపడి, మీదకు ఎక్కడానికి బదులుగా దిగుడు దారులు పట్టి, గంతులు వేసుకుంటూ దిగిపోవడం, తాత్కాలికంగా, సుఖమనిపించవచ్చు. గాని, ఆ దారి అగాధంలోకి, అంధకారంలోకి తీసుకుపోయి, ఇంకెప్పుడూ పైకి ఎక్కలేనంత లోతుకు జార్చివేస్తుంది. అలాగ దిగజారిపోయిన జీవిని, ఆ భగవానుడే ఎప్పటికైనా దయతలచి, బైటకు లాగాలి మరి. ఈ భావాన్నే ఈ శ్లోకం సూచిస్తుంది. తాత్కాలికంగా సుఖమనిపించే ఇంద్రియ విషయలోలత్వం, మానవుణ్ణి రోగాల్లోకి, రొష్టులోకి, భయంకర మరణంలోకి, లాక్కుపోతుంది. అయ్యోపాపం! అతడు చివరి వరకు పాపకృత్యాలు చేయడం మానడు కదా! జన్మించిన ప్రతి శరీరానికి మరణించడం తప్పదు. ఈ వ్యవధిలోనే దేహాన్ని పవిత్రం చేసుకొని, దేవాలయంగా మార్చుకోవాలిగాని రోగాలపుట్టగా తయారుచేసుకొని, హేయమైన నరకంలోనికి దిగజార్చుకోరాదు. దీనికి గోవిందనామస్మరణమే ఏకైక మార్గమని ఆచార్యులవారి బోధ.

## 29

అర్థమనర్థం భావయ నిత్యం, నాస్తితతః సుఖలేశః సత్యం ।
పుత్రాదపి ధనభాజాం భీతిః, సర్వత్రైషా విహితా రీతిః ॥

**ద్రవ్యం ఉపద్రవాలను (అనర్థాలను) తెచ్చిపెట్టేది అని ఎల్లప్పుడూ గుర్తుంచుకో, దానివలన కించిత్తు కూడ సుఖముండదనడం సత్యము. ధనవంతునికి తన స్వంతపుత్రునివలన కూడా ప్రమాదం వాటిల్లే భయముంటుంది. ఎక్కడైనా, ఈ ధనంయొక్క లక్షణమే ఇది.**

ధనము మానవుని చేతనే సృష్టింపబడినదైనను, అతని వెర్రితనంవలన, దానికివ్వవలసిన దానికంటె అత్యధిక విలువ నివ్వడంచేత, అది మానవుణ్ణే బానిసగ జేసి అతనిని శాసించడం మొదలుపెట్టింది. ధనమూలమిదం జగత్తు అనే సూత్రాన్ని ప్రచారంచేసి, దానికోసం ఎంతపనైనా, ఎటువంటి పనిని అయినా, చేయడానికి వెనుదీయకుంటున్నాడు మానవుడు. ఇట్టి ధనం ఎంత ప్రమాదకరమైనట్టిదో తెలుసుకోమన్నారు ఆచార్యులవారు.

అనర్థం అన్నారు, అనగా ఉపద్రవాలు తెచ్చిపెట్టేది. మనుష్యుల మధ్య ద్వేష వైషమ్యాలు కలిగిస్తుంది. గర్వ, మద, అహంకారాలు పుట్టిస్తుంది. లోభము, తృష్ణ కలుగజేస్తుంది. పాపాచరణకు పురికొల్పుతుంది. ఎక్కడా స్థిరముగా నుండక, ధర్మవర్తనులను విడిచి, అక్రమ వర్తనుల్ని ఆశ్రయిస్తుంది. ఎక్కడ ఉంటే అక్కడ సుఖశాంతులు లేకుండా చేస్తుంది. అన్నిరకాల ప్రమాదాలకు, భయాలకు గురిచేస్తుంది. చివరికి కన్నబిడ్డల వలన కూడ ప్రమాదం వాటిల్ల గలదనే భయాన్ని కలుగజేస్తుంది.

అయితే ఈ ధనాన్ని తృణీకరించి పారవేయమని కాదు. దానికివ్వ వలసినంత విలువనే ఇవ్వాలి. మన ప్రయోజనాలను తీర్చే ఒక సాధనంగానే చూడాలిగాని, దానికి సార్వభౌమత్వాన్నిచ్చి మనం దానికి బానిసలం కారాదు. అన్యాయార్జిత ధనమును పొందరాదు. యల్లభసే నిజకర్మోపాత్తం - స్వయంగా కృషిచేసి సంపాదించిన ధనాన్నే అవసరాలకు వినియోగించుకోవాలి. దేయం దీన జనాయ చ విత్తం - మనకు కలిగింది సత్కర్మలకు, లోకకల్యాణానికి వినియోగించాలి, దీనజనులకు సహాయం చెయ్యాలి. అలాంటప్పుడు అర్థం అనర్థంగా పరిణమించదు. ధనంవల్ల కీడు జరగదు. అలాగే సద్వినియోగం జరగనప్పుడు దాని దుష్ఫలితాలు ఎదురౌతాయి. ధనంయొక్క లక్షణాలు ఏమిటంటే - అది ఎక్కడ నిలవ అయిపోయి యుంటే, అక్కడ అనర్థాలు కలుగజేయడం, సుఖశాంతుల్ని అపహరించడం, ఆప్తుల మధ్యకూడా, అపోహలు, భయసందేహాల్ని సృష్టించడం, మొదలైనవి. ఈ సత్యాన్ని తెలుసుకొని మెలగనున్నారు.

## 30

ప్రాణాయామం ప్రత్యాహారం, నిత్యానిత్య వివేకవిచారం ।
జాప్యసమేత సమాధివిధానం, కుర్వవధానం మహదవధానం ॥

**ప్రాణాయామం చేయాలి, ప్రత్యాహారం (ఇంద్రియ నియంత్రణ) చేయాలి, నిత్య అనిత్య, వస్తు వివేచవచే, విచారణ చేయాలి. నామజపంతోపాటు ధ్యానం చేయాలి. సమాధిస్థితిని పొందువిధానం అతి మెళకువతో అభ్యసించాలి. జాగ్రత్తగా ఆచరించాలి.**

వెనుకటి శ్లోకాల్లో అయిదు బహిరంగ సాధనలు చెప్పబడినవి. 1. గీతాధ్యయనము, 2. పరమేశ్వరార్చన, 3. సత్సంగము, 4. దాతృత్వము (దానశీలత), 5. ధనకాంక్షా రాహిత్యము. ఈ శ్లోకంలో అయిదు అంతరంగ సాధనలుచెప్పబడినవి: 1. ప్రాణాయామం, 2. ప్రత్యాహారం, 3. నిత్యానిత్యవస్తు వివేకవిచారము, 4. జపము, 5. సమాధి.

ప్రాణాయామం అంటే కేవలం ఉచ్ఛ్వాస నిశ్వాసాలు గతి నియంత్రణమే కాదు. శరీరంలో చలనశక్తిని కలిగించు పంచవాయువుల సముదాయాన్ని ప్రాణమనవచ్చు. ఇవి: ప్రాణ, అపాన, వ్యాన, సమాన, ఉదాన వాయువులు. వీటన్నిటిని, నియంత్రించి క్రమబద్ధముగ నడిపించడమే ప్రాణాయామం.

ప్రత్యాహారమంటే పంచ జ్ఞానేంద్రియాలను (శ్రోత్రం, చక్షుః, త్వక్, రసనం, ఘ్రాణాలను) విషయాలనుండి (శబ్ద, రూప, స్పర్శ, రస, గంధములనుండి) వెనుకకు లాక్కొని, చిత్తంతో ఐక్యం చేయడం.

నిత్యానిత్యవస్తు వివేక విచారమంటే, సకల చరాచర, దృశ్య, అదృశ్య, సృష్టి అంతా అనిత్యమూ అశాశ్వతమూ మార్పుతో కూడియున్నదీ, నశించునట్టిదీ, కావున "అసత్" అనబడుతుంది - అని తెలుసుకోవడం. నాశములేనిది, శాశ్వతమైనది, మార్పులేనిది, అగు సత్ వస్తువును "సత్" అంటారు. అదియే ఆత్మ. ఈ విచారం వేదాంత గ్రంథాధ్యయనం ద్వారా, సద్గురువు బోధలద్వారా, సాధ్యమవుతుంది.

జపసహిత ధ్యానం: ఒకే నామంగాని, మంత్రంగాని నిరంతరం ఉచ్చరిస్తూ నామమూర్తిని (మంత్రమూర్తిని) చిత్తమందు నిలిపి ధ్యానం చేయాలి. సత్ అసత్‌ల విచక్షణచేసి అసత్ వస్తువులను తిరస్కరించి, కేవలం సత్ వస్తువుపైనే ధ్యానం కేంద్రీకరించాలి.

**సమాధి** : ఇంద్రియ మనోబుద్ధులు లయమైపోయి, ఆలోచన లుద్భవించ కుండా, సంకల్ప వికల్ప విక్షేపాలు తలెత్తకుండా, చిత్తము ధ్యేయ వస్తువుపైననే లగ్నమై ఎట్టి బాహ్య విషయ స్పర్శలకు స్పందించకుండా, కాల నిర్ణయము లేకుండా నిశ్చలముగ నుండగలుగు స్థితిని సమాధి అంటారు. ఇది జీవన్ముక్తికి ముందరి అవస్థ.

ఈ ప్రక్రియలు, అభ్యాసాలూ, అవధానము (జాగరూకత)తో, మహదవధానం (మిక్కిలి జాగరూకత)తోచేయవలసినట్టివి అని జగద్గురువు చెప్పారు. ఆధ్యాత్మిక సాధనలలో తొందర అసలే పనికిరాదు. అవధానము, మహదవధానం చాలా అవసరం.

## 31

**గురుచరణాంబుజ నిర్భరభక్తః, సంసారాదచిరాద్భవ ముక్తః ।**
**సేంద్రియమానస నియమాదేవం, ద్రక్ష్యసి నిజహృదయస్థం దేవం ॥**

**గురుచరణ కమలములందు మిక్కిలి భక్తిగల ఓ సాధకుడా! ఈ సంసార బంధనాలనుండి శీఘ్రముగనే ముక్తి పొందుదువుగాక! నీ ఇంద్రియ మనస్సులను నియమించి (అదుపులో పెట్టి)న వాడవై నీ హృదయంలోనే ఉంటున్న దేవుని దర్శించెదవు గాక!**

గురువుమీద భక్తి, గురువాక్యములపై విశ్వాసము, గురు ఆదేశముల నెరవేర్చుటలో శ్రద్ధ, ఈ మూడూ కలిగియున్న శిష్యునికి ఆధ్యాత్మిక పురోగమనం చాలా సులువౌతుంది. విశ్వాసమే మానవుని యందు నిక్షిప్తమైయున్న ఒక మహత్తర శక్తి. గురువు చెప్పిన విషయం. మనకు వెంటనే అవగాహన కాకపోయినా, అతని భావనాగతి ననుసరించి యోచనచేస్తే తెలియవస్తుంది. గురువుయందు భక్తివిశ్వాసాలు లేని శిష్యుడువచ్చి, వెళ్ళిపోయే బాటసారిగానే మిగిలిపోతాడు.

ఈ శ్లోకాలు చెప్పినప్పుడు తనవద్దనున్న వారినే కాకుండా తరువాతి తరాలలోని శ్రద్ధా భక్తి విశ్వాసాలు గల శిష్యులందర్నీ ఆచార్యులవారు - శీఘ్రమే సంసార బంధనాలనుండి విముక్తులగుదురు గాక - అని, ఆశీర్వదించారు. ఈ ముక్తి ఎప్పుడో ఎక్కడో కాదు, ఇప్పుడే, ఇక్కడే, లభించవచ్చు - ఇంద్రియ, మనస్సుల్ని అదుపులో పెట్టి, అంతర్యామిని సాక్షాత్కరించుకుందురు గాక! అని దీవించారు. తథాస్తు!

ఈ భజగోవింద స్తోత్రముద్వారా శంకరులవారు నిగూఢమైన వేదాంత

సూత్రాలను, జీవిత సత్యాలను, మూఢులైన పామరులకు కూడా అర్థమయే భాషలో, గేయశైలిలో, ఆబాలగోపాలమూ పాడుకొనే రీతిలో చెప్పారు. మానవుడు, సంసార వ్యవహారాల్లో, కామినీ కాంచన వ్యామోహంలో, భార్యాబిడ్డల బంధనాల్లో, ధన, జన, యౌవన, గర్వంలో కామక్రోధ లోభ మోహం, ఆశపాశాల్లో చిక్కుకొని, గమ్యం కానక, అంధకారంలో కొట్టుకుంటున్నాడు. లేవోయీ, మూఢుడా! అని భుజంతట్టి లేపి, ఏమి చేయాలో, మార్గం చూపారు. సత్సంగంద్వారా, గీతా, సహస్రనామ, అధ్యయనం ద్వారా, శ్రీవారిపాదసేవద్వారా, ఇంద్రియ మనోబుద్ధుల నిగ్రహంద్వారా, ఆత్మారాముని దర్శించి, తరించుమని ఉపదేశించారు. నీ సమయం ఆసన్నమవుతూంది. ఇక వ్యర్థపు ఆలోచనల్లో, వ్యవహారాల్లో, కాలక్షేపం చేయడానికి వ్యవధి లేదు సుమా! లే! తొందరపడు, ఇప్పుడైనా, గోవిందుని భజించు, శరణువేడు, నా వెర్రినాయనా! అని అత్యంత ప్రేమాదరాలతో మనల నందరినీ మందలిస్తున్నారు, జగద్గురు శ్రీశంకరాచార్యులవారు.

**భజగోవిందం, భజగోవిందం, గోవిందంభజ మూఢమతే ।**
**సంప్రాప్తే సన్నిహితే కాలే, నహినహి రక్షతి డుకృఞ్కరణే ॥**

❖ ❖ ❖

# గోవిందనామ సంకీర్తనలు

1. భజగోవిందం, భజగోవిందం, భజగోవిందం హరే, హరే
భజగోవిందం, బాలముకుందం పరమానందం హరే హరే

2. గోవిందహరే, గోపాలహరే, హే గోపి గోపబాలా
గోవిందహరే, గోపాలహరే, హే మురళిగాన లోలా ॥గోవింద॥
గోవిందహరే, గోపాలహరే, హేనందగోపబాలా
గోవిందహరే, గోపాలహరే, హే రాధాహృదయలోలా ॥గోవింద ॥

3. గోవిందేతి సదా స్మారం, గోవిందేతి సదా జపం
గోవిందేతి సదా ధ్యానం, సదా గోవింద కీర్తనం ॥గోవింద॥

4. గోవిందాగోపాల ప్రభుగిరిధారి, గోవిందా గోపాలహృదయ విహారీ॥గోవిందా॥
నందకుమారా నవనీతచోరా, హృదయవిహారబడా చిత్త చోరా॥గోవిందా॥

5. భజగోవిందం, భజగోపాలం, కేశవ మాధవ దీనదయాళం
దీనదయాళం, దీనదయాళం, కేశవ మాధవ దీన దయాళం ॥భజ॥

6. గోవింద జైజై, గోపాల జైజై, రాధారమణహరే గోవింద జైజై ॥గోవింద॥

❖ ❖ ❖